జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 19 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 176 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని ఆరా!

మోదీకి యూఏఈ అధ్యక్షుడు ఫోన్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఇండియా-యూఏఈ పరస్పరం సహకరించుకునే దారిలో వెళ్తున్నాయి. తాజాగా భారత ప్రధాని నరేంద్ర మోదీ.. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మాట్లాడారు.

మిగతా 2లో..

## మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం

మమతా బెనర్జీ పార్టీకి కొత్త పేరు కేటాయింపు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను

మిగతా 2లో..

# దానంపై అనర్హత వేటు

కాంగ్రెస్‌కు షాకిచ్చిన తెలంగాణ హైకోర్టు

స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టిన హైకోర్టు

ఎమ్మెల్యేగా అనర్హుడన్న న్యాయస్థానం

పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తీర్పు!

హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నా: దానం

సత్యమేవ జయతే: కేటీఆర్ హర్షం

సీఎం రేవంత్‌కు కోర్టు బ్రేక్: పాడి కౌశిక్

దానం నాగేందర్ రాజీనామా చేయాలి: ఏలేటి



ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఆయనపై కోర్టు అనర్హత వేటు వేసింది. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీఫామ్ మీద ఘన విజయం సాధించిన దానం, ఆ తర్వాత 2024 మార్చి 17న కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతేకాకుండా, వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆయన ఎంపీగా పోటీ చేసిన ఈ కీలక అంశాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం.. దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. స్పీకర్ నిర్ణయాన్ని సైతం హైకోర్టు ఈ సందర్భంగా పక్కనబెట్టింది. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. స్పీకర్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును మిగతా 2లో..

## 17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

నిర్మానుష్య ప్రాంతంలో బాలిక మృతదేహం

మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న దుస్థితి!

దేశ రాజధానిలో దారుణ ఘటన వెలుగులోకి..

ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని స్వరూప్ నగర్‌లోని ఓ బహిరంగ ప్రదేశంలో పడేశారు. కొన్ని రోజుల తర్వాత అక్కడ మృతదేహం లభ్యమైంది. కుషక్ రోడ్ సమీపంలోని పొలాల్లో మృతదేహం పడి ఉందని సెప్టెంబర్ 13 ఉదయం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహం

మిగతా 2లో..



# 22ఏపై హైలెవల్ కమిటీ

తెలంగాణలో 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి హై లెవల్ కమిటీ ఏర్పాటు చేసింది. 22ఏ సమస్యలను ఫాస్ట్ ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో ఈ కమిటీ ఏర్పాటు చేయగా.. కమిటీ చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్.. సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతులు ఉన్నారు.

22ఏ భూముల సమస్యల పరిష్కారానికి అడుగులు

లోకేశ్‌కుమార్ నేతృత్వంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు

వివాదాస్పద భూముల పరిష్కరానికి లైన్ క్లియర్!!

ప్రకటించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22ఏ కు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి జీ.ఓ.ఆర్.టి నెం. 564 ను , జారీచేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్ గా సిసిఎల్ఎ డి.ఎస్. లోకేష్ కుమార్ వ్యవహరిస్తారు. లా సెక్రటరీ, పాపి రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐ.జీ. రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో భూములపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య గత కొద్దిరోజులుగా వివాదం నడుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 22ఏ పూర్తిగా న్యాయబద్ధమైనది కాదని దాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో, బయట నిరసనలు, ధర్నాలు చేపట్టారు. అయితే దీనికి కొనసాగింపుగానే శుక్రవారం అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22-ఏ కు సంబంధించిన మిగతా 2లో..

# ఆర్టీసీలో ఎన్నికల నగారా!

గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

దాదాపు 10 ఏళ్ల విరామం తర్వాత ఎన్నికలు

ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

అక్టోబర్ 9న పోలింగ్.. అక్టోబర్ 17న ఫలితాలు



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో కార్మికులు, ఉద్యోగులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. దాదాపు 10 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈనెల 21వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అక్టోబర్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 17వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జూలై 19వ తేదీన గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే తదుపరి ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ.. అవి నిర్వహించలేదు. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం కార్మిక సంఘాలు, మిగతా 12లో..

## సురీందర్ కోలీ ఆత్మహత్య!!

హరిద్వార్‌లో అనుమానాస్పద మృతి!

'నిఠారీ' హత్యల నిర్దోషిగా బయటికి..



ఒకప్పుడు 'నిఠారీ రాక్షసుడు'గా ముద్రపడి, సంచలనం సృష్టించిన 2006 నాటి హత్యల కేసులో నిర్దోషిగా విడుదలైన సురీందర్ కోలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఒక టీస్టాల్ లోపల ఉరికి వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో అతడి మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనా మిగతా 2లో..

## స్పామ్ కాల్స్‌కు ఇక స్వస్తి..

రోబోకాల్స్‌పై ట్రాయ్ కొత్త నిబంధనలు

స్పామ్ కాల్స్, వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆటోమేటెడ్ కాల్స్, వినియోగదారుల విచారణ ఆధారంగా చేసే ప్రచార కాల్స్‌పై ఆంక్షలను

మిగతా 2లో..



## మరో 9.56 లక్షల ఇళ్లు ఇవ్వండి

రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇండ్లు

కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు

కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన సీఎం



తెలంగాణ రాష్ట్రానికి మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించిన సంగతి తెలిసిందే.తెలంగాణలోని 11.56 లక్షల మిగతా 12లో..

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే

388 ఎకరాల భూమిపై అధికారుల దృష్టి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి మిగతా 2లో..

## ఆస్ట్రేలియా వీసాలపై ఆంక్షలు

డిపెండెంట్ వీసాలు నిలిపివేత

ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లాలని కలలు కనే విదేశీ విద్యార్థులకు ఆ దేశ ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. ఇప్పటి వరకు చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులు తమ జీవిత భాగస్వాములను (భార్య/భర్త), పిల్లలను కూడా తమతో పాటు తీసుకెళ్లే వెసులుబాటు ఉండేది. అయితే ఇకపై అలాంటి అవకాశాలకు చెక్ పెడుతూ, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను వెంట తీసుకురాకుండా నిషేధం విధించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. దీనికితోడు తాత్కాలిక వీసాలపై ఉన్నవారు ఇతర వీసాల్లోకి మారే నియమాలను కూడా మిగతా 2లో..

## లక్ష కోట్లలో వెయ్యి కోట్లు ఇస్తే చాలు

సీఎం ఎక్కడంటే అక్కడ సంతకం పెడదా

పేదలకు లక్ష కోట్లు ఇస్తే.. మా ఆస్తులన్నీ రాసిస్తాం!

సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్

న్యాయస్థానాలపై నాకు నమ్మకం ఉంది..

భవిష్యత్తులో ఎప్పుడు పిలిచినా మళ్లీ వస్తా

ఫార్ములా-ఈ రేస్ కేసులో కోర్టులో హాజరు



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములపై అధికారులు సర్వే చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల ప్రభుత్వ భూములపై అధికారులు ఆరా తీస్తున్న క్రమంలో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబానికి లక్ష కోట్ల ఆస్తులు ఉన్నాయంటూ సీఎం చేస్తున్న ప్రచారంపై బహిరంగ సవాల్ విసిరారు. రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాల్లో రేవంత్ వెంటనే లక్ష కోట్లు జమ చేస్తే.. తమ పేరు మీద ఉన్న ప్రతి ఇంచు భూమిని వారికే రాసిస్తామని కేటీఆర్ ప్రకటించారు. లేకపోతే ఈ పిచ్చి ప్రచారాన్ని మిగతా 12లో..

# సంపాదకీయం

## గతితప్పిన సుంకాలు!?

అర్థంపర్థం లేని సుంకాలతో అమెరికా ప్రపంచాన్ని భయపెడుతూంది. సందు దొరికితే చాలు ఎ దేశం పై ఎంత శాతం సుంకాలు విధించాలని ఉవ్విల్లూరుతుంది అగ్రరాజ్యం. తాజాగా భారత్ పై అదే రకమైన సుంకాలు విధించింది. రష్యా, ఇరాన్‌లపై కఠిన ఆంక్షలను విధించడంతో పాటు, ఆ దేశాల నుంచి ముడి చమురు, ఇంధన వనరులను దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా వంటి ప్రధాన దేశాలపై భారీ ప్రతీకార సుంకాలు మోపే విశేషాధికారాలను అమెరికా అధ్యక్షుడికి కట్టబెట్టే కీలక బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరిట రూపొందించిన ఈ వివాదాస్పద బిల్లు అమెరికా ప్రతినిధుల సభలో భారీ మెజారిటీతో నెగ్గింది. గత నెలలోనే సెనేట్ ఆమోదం పొందిన ఈ బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడమే తరువాయిగా మారింది. ఈ తాజా పరిణామం ప్రపంచ ఇంధన మార్కెట్‌తో పాటు ద్వైపాక్షిక సంబంధాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. ప్రతినిధుల సభలో బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 262 ఓట్లు, వ్యతిరేకంగా 159 ఓట్లు వచ్చాయి. సభలో అధికార రిపబ్లికన్ పార్టీకి 218 మంది సభ్యుల బలమే ఉన్నప్పటికీ, ప్రత్యర్థి డెమోక్రాట్ల నుంచి 59 మంది సభ్యులు, మరొక స్వతంత్ర సభ్యుడు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం విశేషం. ట్రంప్‌నకు అత్యంత విధేయుడు, సౌత్ కరోలినా సెనేటర్ అయిన లిండ్సే గ్రాహం దాదాపు ఏడాది కాలంగా ఈ చట్టం కోసం తీవ్రంగా శ్రమించారు. రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, ఇరాన్ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తెరపైకి తెచ్చారు. ఈ చట్టం అమల్లోకి వస్తే అమెరికా అధ్యక్షుడికి అపరిమిత అధికారాలు లభిస్తాయి. రష్యా రాజకీయ నాయకత్వం, కీలక ఇంధన రంగాలపై ఏకపక్ష ఆంక్షలు విధించవచ్చు. అంతర్జాతీయ ఆంక్షలను దాటవేస్తూ సముద్ర మార్గాల్లో రష్యా ముడి చమురును రవాణా చేస్తున్న 'డోలార్ షాడో ఫ్లీట్' నౌకలపై కఠిన నిబంధనలు అమలు చేయవచ్చు. రష్యా చమురు, సహజ వాయువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలంటూ ఒత్తిడి తెస్తూ, ఆ దేశంతో వాణిజ్యం కొనసాగించే భారత్, చైనా లాంటి దేశాలపై ఏకంగా 100 శాతం వరకు ప్రతీకార సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడి చేతుల్లోకి వెళ్తుంది. ఇరాన్ చమురు వ్యాపారం, ఆర్థిక లావాదేవీలపై మరిన్ని పకడ్బందీ ఆంక్షలు అమలు చేయవచ్చు.అమెరికా ప్రతిపాదిత చర్యలపై భారత్ అత్యంత ఘాటుగా స్పందించింది. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా మార్కెట్లో లభించే భిన్నమైన మార్గాల ద్వారా ఇంధన అవసరాలను తీర్చుకుంటామని స్పష్టం చేసింది. ఈ బిల్లు వల్ల ఏర్పడే పర్యవసానాలపై ఇప్పటికే అమెరికా దౌత్య ప్రతినిధులతో పలు దఫాలుగా ఉన్నత స్థాయి చర్చలు జరిపామని భారత్ వెల్లడించింది. రష్యాపై ఆంక్షల నెపంతో తమపై సుంకాలు విధిస్తే, అది భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీయడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరల అస్థిరతకు దారితీస్తుందని హెచ్చరించింది. మరోవైపు ఈ బిల్లుపై చైనా సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం లేని ఎలాంటి ఏకపక్ష ఆంక్షలను చైనా అంగీకరించబోదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియావోతున్ స్పష్టం చేశారు. పరస్పర ప్రయోజనాలు, సమానత్వ ప్రాతిపదికన తాము అన్ని దేశాలతో వాణిజ్య సంబంధాలను నెరుపుతున్నామని, మూడో దేశం తమ వ్యాపార సమన్వయాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్న సమయంలో ఈ బిల్లు ఆమోదం పొందడం దౌత్య వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు అమెరికాకు రష్యా, చైనాలు షాక్ ఇచ్చాయి. యూఎస్ శత్రు దేశం ఇరాన్‌కు అండగా నిలిచాయి. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీ గడువును మరో ఏడాది పాటు పొడిగించాలనే అమెరికా ప్రతిపాదనను రష్యా, చైనాలు వీటో చేశాయి. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలుగా వీటో అధికారాలు ఉన్న ఈ రెండు దేశాలు గురువారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా తీర్మానాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. యూఎన్‌లో అమెరికా తీర్మానంపై ఓటింగ్ జరగ్గా, ఈ ప్రతిపాదన 11-2 ఓట్ల తేడాతో ఓడిపోయింది. కాగా, రష్యా, చైనాల వీటో అధికారాన్ని వాడుకోగా, సోమాలియా, పాకిస్థాన్‌లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత ఆర్నెల్లుగా ఇరాన్‌తో భీకరంగా యుద్ధం నేపథ్యంలో టెహ్రాన్‌ను ఆర్థికంగా ఏకాకిగా చేసేందుకు అగ్రరాజ్యం అమెరికా విస్తృతంగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ, యూకేల మధ్య 2015లో కుదిరిన అణు ఒప్పందం నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని యూరప్ దేశాలు ఆరోపించాయి. ఈ క్రమంలో ఐరాస కీలక నిర్ణయం తీసుకుంది. 2025 సెప్టెంబరులో స్నాప్‌బ్యాక్ మెకానిజం కింద ఇరాన్‌పై చర్యలు తీసుకుంది. ఇరాన్‌పై ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీకి అధికారం కల్పించింది. కాగా, ఇరాన్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆంక్షలు ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. ఇరాన్ విదేశీ ఆస్తులను స్తంభింపజేయడం, టెహ్రాన్‌తో ఆయుధ ఒప్పందాలను నిలిపివేయడం, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమ అభివృద్ధిని నిరోధించడం వంటి ఇతర చర్యలు ఈ ఆంక్షల్లో ఉన్నాయి.తమ దేశానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానాన్ని వీటో చేసినందుకు చైనా, రష్యాలకు ఇరాన్ మిషన్ కృతజ్ఞతలు తెలిపింది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఐరాస భద్రతా మండలిని దుర్వినియోగం చేయడానికి అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న మరో నీచ ప్రయత్నాన్ని ఈ దేశాలు అడ్డుకున్నాయని పేర్కొంది. ఐరాస భద్రతా మండలిలో అమెరికా తీర్మానికి వ్యతిరేకంగా చైనా, రష్యాలు వీటో చేయడంపై హర్షం వ్యక్తం చేసింది. ఇప్పుడు ఈ విషయంలో అగ్రరాజ్యం ఒంటరిదైందనే చెప్పుకోవాలి.

## ఆస్ట్రేలియా వీసాలపై ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి..

మరింత కఠినతరం చేయనుంది. దేశంలోకి విపరీతంగా పెరుగుతున్న వలసదారుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ప్రతిటా సుమారు 3 లక్షలుగా ఉన్న నికర విదేశీ వలసదారుల సంఖ్యను 2028 నాటికి 2,25,000కు తగ్గించాలని ఆస్ట్రేలియా హోం వ్యవహారాల శాఖ భావిస్తోంది. కొవిడ్ నిబంధనలు ఎత్తివేసిన తర్వాత అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక కార్మికుల రాక ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని సమాచారం. గత కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాలో విదేశీ వలసదారుల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల అక్కడ నివాస గృహాల కొరత తీవ్రమైంది. అద్దెలు ఆకాశాన్ని తాకడంతో పాటు స్థానిక మౌలిక వసతులపై విపరీతమైన భారం పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో పెరిగిన ఇళ్ల కొరత, రవాణా ఇబ్బందులకు చెక్ పెట్టాలంటే వలసదారుల సంఖ్యను నియంత్రించక తప్పదని స్థానిక రాజకీయ వర్గాలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఆస్ట్రేలియా వెళ్లే విదేశీ విద్యార్థులలో సగానికి పైగా వాటా చదువుకోవడానికి వెళ్లేవారే ఉంటారు. ఇప్పటివరకు డిగ్రీ లేదా మాస్టర్స్ చేసేవారు తమ భాగస్వామిని తీసుకెళ్తే, అక్కడ వారు వర్క్ పర్మిట్ అనుమతి ఉండేది. కానీ ఇప్పుడు కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, కుటుంబ సమేతంగా వెళ్లి చదువుకోవాలనుకునే భారత్ సహా ఇతర దేశాల విద్యార్థులకు తీవ్ర నిరాశే మిగలనుంది.

## స్పామ్ కాల్స్‌కు ఇక స్వస్తి..

మొదటిపేజీ తరువాయి..

మరింత కఠినతరం చేసింది. ఒక వ్యక్తి ఏదైనా ఉత్పత్తి లేదా సేవ గురించి కంపెనీని సంప్రదిస్తే.. ఆ విచారణ ఆధారంగా వాణిజ్య సందేశాలు లేదా కాల్స్ ఏడు రోజుల వరకే చేసేందుకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత అదే విచారణను ఆధారంగా చేసుకుని ప్రచార కమ్యూనికేషన్ చేయడానికి వీలుండదు. ఇక ముందుగా రికార్డు చేసిన వాయిస్‌తో చేసే ఆటోమేటెడ్ లేదా రోబోకాల్స్‌కు 'ప్రీ-డిక్లరేషన్' తప్పనిసరి చేసింది ట్రాయ్. ఈ డిక్లరేషన్ లేకుండా ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చేసే కాల్స్‌ను స్పామ్‌గా పరిగణిస్తారు. అనుమతి లేని ఆటోమేటెడ్ కాల్స్‌ను నిరుత్సాహపరిచేందుకు ఒక్కో కాల్‌కు 5 పైసల టెర్మినేషన్ ఛార్జీ విధించాలని నిర్ణయించింది. దీంతో వాణిజ్య అవసరాల కోసం ఆటోమేటెడ్ కాలింగ్ సిస్టమ్స్‌ను దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట వేయాలని ట్రాయ్ భావిస్తోంది. లావాదేవీలు, సేవలకు సంబంధించిన కాల్స్ కోసం 1601 సిరీస్ నంబర్లను ఇతర రంగాలకు విస్తరించే ప్రక్రియను ట్రాయ్ ప్రారంభించింది.

# 22ఏపై హైలెవెల్ కమిటీ



మొదటిపేజీ తరువాయి..

అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లుగా ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా ఆనాడు ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఉన్న రెగ్యులరైజేషన్ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఎల్.బి. నగర్ నియోజకవర్గంలో 118 జీ.ఓ. ప్రకారం 9,700 ప్లాట్ల రేగ్యులరైజేషన్ కు సంబంధించిన మెమోను శుక్రవారం నాడు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ జీ.ఓ. ప్రకారం ఆ ప్రాంతంలో రేపటి నుంచి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దశాబ్దాల కాలంగా అక్కడ ప్లాట్లు తీసుకొని ఇండ్ల నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న ఇండ్ల యజమానులు 118 జీ.ఓ. ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు మంత్రి పొంగులేటి. సింగరేణి ప్రాంతంలో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో 76ను జారీ చేశారని ఆ జీవోను అనుసరించి శనివారం నాడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. అదే విధంగా రెవెన్యూ రికార్డులలో 22ఎలో ఉండి హెచ్ఎండిఎ , డిటిసిపి, జిహెచ్ఎంసీ అనుమతులతో లేఅవుట్లు వేసిన ప్రాంతాలను 22ఎ నుంచి తొలగించే విషయంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. శాసనసభలో సీఎం ప్రకటించిన 10-12 అంశాలపై నెలరోజుల వ్యవధిలోనే నిర్ణయం తీసుకొని 22ఎ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూసంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్ 118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సింగరేణి కాలనీ పరిధి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అక్కడ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చలు జరిపి, జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు. అదే సమయంలో సెక్షన్ 22ఏ కారణంగా హెచ్ ఎండీఏ, జీహెచ్ఎంసీ లేదా డీటీసీపీ వంటి సంబంధిత అధికారుల ద్వారా ఆమోదం పొందినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా ఈ లేఅవుట్ల రెగ్యులరైజేషన్ ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శాసనసభ వేదికగా వెల్లడించారు.

# దానంపై అనర్హత వేటు



మొదటిపేజీ తరువాయి..

రద్దు చేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం కాకపోవడంతో సీజే ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు.స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసనసభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు. దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాని కోరారు. దానం ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నారని శాసనసభలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరపు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

కాగా హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని ఆయన వివరించారు. ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడతామన్నారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని దానం వివరించారు. పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చినవాడినని తెలిపారు. దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ పరిణామంపై ఎక్స్ వేదికగా 'సత్యమేవ జయతే' అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన మిగతా ఎమ్మెల్యేలకు కూడా భవిష్యత్తులో ఇదే గతి పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా తీర్పును అపహాస్యం చేసిన వారు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారని కేటీఆర్ హెచ్చరించారు.హైకోర్టు తీర్పు అనంతరం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదని ఆయన విమర్శించారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయవచ్చని భావించిన రేవంత్‌కు కోర్టు బ్రేక్ వేసిందని ఎద్దేవా చేశారు. దానం నాగేందర్ ఫైటర్ కాదని, చీటర్ అని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల పరిస్థితి ఏ పార్టీ వారో చెప్పుకోలేని విధంగా దారుణంగా ఉందని అన్నారు. దానం లాగే పార్టీ మారిన మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై కూడా త్వరలో అనర్హత వేటు పడటం ఖాయమని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన కడియం శ్రీహరి లాంటి నేతల నైతికతపై ఎథిక్స్ కమిటీ విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చారిత్రాత్మక తీర్పు వెలువరించిన తెలంగాణ హైకోర్టుకు కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును బీజేపీ తీవ్రంగా స్వాగతించింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దానం నాగేందర్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున, రేపే బీజేపీ తరఫున కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవాలనే కాంగ్రెస్ కుట్రలకు ఈ తీర్పు చెంపపెట్టు అని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కూడా హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఆరు నెలల వ్యవధిలోనే రాజ్యాంగబద్ధమైన తీర్పు రావడం చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తీరుకు ఈ తీర్పు సరైన సమాధానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువలతో కూడిన రాజకీయం కోసం హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాయని అభిప్రాయపడ్డారు.

## 17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

మొదటిపేజీ తరువాయి..

తీవ్రంగా కుళ్లిపోవడంతో తొలుత బాధితురాలి లింగాన్ని కూడా ఫోరెన్సిక్ బృందాలు వెంటనే నిర్ధారించలేకపోయాయి. పోలీసుల ప్రకారం.. బాలికకు నిందితులతో ముందే పరిచయం ఉంది. వారంతా ఓ టెంపోలో కలిసి మద్యం సేవించిన తర్వాత బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మృతదేహంలో కొంత భాగాన్ని వీధి కుక్కలు తినేశాయని పోలీసులు తెలిపారు. ఓ చేయి మృతదేహానికి దూరంగా పొలంలో లభించినట్లు చెప్పారు. బాలిక కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదు. ఆమె తరచూ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం

ఐ. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 50కుపైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ టెంపోను గుర్తించారు. చీకటి, తక్కువ వెలుతురు కారణంగా తొలుత వాహనం నంబర్ స్పష్టంగా కనిపించలేదు. చివరకు టెంపోను ఖడ్డా కాలనీలో గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా మరో ముగ్గురి వివరాలు బయటపడ్డాయి. దీంతో 16 నుంచి 17 ఏళ్ల వయసున్న ముగ్గురు మైనర్లతో పాటు శివమ్ అలియాస్ సుదామాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న రెండు కత్తులు, నిందితులు ధరించిన రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద కేసు నమోదు చేశారు.

## సురేందర్ కోలీ ఆత్మహత్య!!

మొదటిపేజీ తరువాయి..

స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న ఆధార్ కార్డ్ ఆధారంగా మృతుడిని సురేందర్ కోలిగా గుర్తించారు. గత ఏడాది సుప్రీంకోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసిన తర్వాత, గత కొంతకాలంగా హరిద్వార్‌లో టీ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. అతడి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, 2006 డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టార్ 31లోని డీ 5 బంగ్లా పక్కన ఉన్న కాలువ వెనుక ప్లాస్టిక్ సంచులలో కుక్కిన 16 మానవ పుర్రెలు, ఎముకలు, దుస్తులను పోలీసులు కనుగొన్నారు. సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన పేదలు, కూలీల కుటుంబాలకు చెందిన పిల్లలు అదృశ్యమవుతున్నట్లు స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేశారు. అయితే వారి ఆందోళనలను పోలీసులు తొలుత పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పాయల్ అనే యువతి అదృశ్యంపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఆమె మొబైల్ ఫోన్‌ను స్థానికుడైన రిక్షా వ్యక్తి వద్ద గుర్తించారు. డి-5లో నివసించే వ్యక్తి ఆ మొబైల్ ఫోన్ తనకు ఇచ్చినట్లు అతడు చెప్పాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మొనిందర్ సింగ్ పాంధర్‌కు చెందగా, సురేందర్ కోలి అక్కడ పనివాడిగా ఉన్నాడు. పోలీసులు ఆ ఇంట్లో సోదాలు చేయగా 19 మంది పిల్లల హత్యలు, నరమాంస భక్షణకు సంబంధించిన ఆధారాలు లభించాయి. నిఠారీలో నివసించే పేద పిల్లలను ప్రలోభపెట్టి, వారిని చంపి, మృతదేహాలను ముక్కలు చేసి, వండుకొని తిన్నారన్న పుకార్లు వ్యాపించాయి.

## మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి..

కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్' గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తాజాగా ఈ కేటాయింపులు చేసింది.

మరోవైపు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్న నేపథ్యంలో, బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి ఐక్యతను చాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి సంచితా ప్రధాన్ అనూహ్యంగా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామంతో తాము మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు. ఈ సందర్భంగా మమత బెనర్జీ మాట్లాడుతూ, "మేము పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. దేశం నుంచి బీజేపీని తరిమికొట్టడమే మా లక్ష్యం. ఇండియా కూటమికి మా పూర్తి సంఘీభావం ఉంటుంది" అని పేర్కొన్నారు. అంతకుముందు రోజు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సైతం మద్దతు తెలుపుతూ సందేశం పంపారని ఆమె వివరించారు. ఇదే క్రమంలో బీజేపీని ఒక 'జుమ్లా పార్టీ'గా ఆమె అభివర్ణించారు. రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన తర్వాత సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. కాగా టీఎంసీలోని రెండు వర్గాలకు ఎన్నికల సంఘం కొత్త గుర్తులను కేటాయించింది. మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ప్రత్యర్థి వర్గానికి 'ఎన్వలప్' గుర్తులను కేటాయించిన సంగతి తెలిసిందే.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని ఆరా!

మొదటిపేజీ తరువాయి..

శుక్రవారం షేక్ మొహమ్మద్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఇండియా-యూఏఈ పరస్పరం సహకరించుకునే దారిలో వెళ్తున్నాయి. తాజాగా భారత ప్రధాని నరేంద్ర మోదీ.. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మాట్లాడారు. శుక్రవారం షేక్ మొహమ్మద్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ప్రభుత్వ వర్గాల ప్రకారం మోదీ, షేక్ మొహమ్మద్ మధ్య ఎనర్జీ, రక్షణ, టెక్నాలజీ, పెట్టుబడులు, హెల్త్ వంటి అంశాలపై చర్చలు జరిగాయి. అయితే, ఒకపక్క పశ్చిమాసియలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరు దేశాధినేతలు చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ంకా భారత్ బ్రిక్స్ అధ్యక్షత

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే

మొదటిపేజీ తరువాయి..

సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

**CHANGE OF NAME**

I, GANDU VARSHINI, (New Name) D/o Gandu Sridhar, R/o 1-30, Kothagattu Village, Atmakur Mandal, Hanumakonda District. I Have Changed my name From GANDU PAVANI (Old Name) to GANDU VARSHINI (New Name) for all Future Purposes.

## పోషకాహారంతో తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



**నేరడిగొండ, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి) :** పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని గుత్పాల గ్రామం ఏడబ్ల్యూసీ-1 కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులకు పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా '1000 రోజుల ప్రాముఖ్యత'పై వివరించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు 24 నెలల వయస్సు వచ్చే వరకు కాలం ఎంతో కీలకమని తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు అందించి, ఏడు నెలల నుంచి అనుబంధ ఆహారాన్ని ప్రారంభిస్తూ, పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పరిశుభ్రత, సరైన సంరక్షణ ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఆయా, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**పోలీసు సిబ్బందికి స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**





**మంచిర్యాల, 18, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా స్వయంగా భక్తులకు, పోలీసు సిబ్బందికి అన్నప్రసాదాన్ని వడ్డించారు. పోలీసు సిబ్బందితో కలిసి భోజనం చేసి, వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో సీపీ ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయం, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. విధుల నిర్వహణలో పరస్పర సహకారం, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి పోలీసు ఉద్యోగి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సీపీ ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## జనగణనలో ఓబీసీ కాలం ఏర్పాటు చేయాలి

**కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని మంచిర్యాలలో అర్ధనగ్న ప్రదర్శన**



**మంచిర్యాల, 18, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో ఓబీసీ కాలం ఏర్పాటు చేసి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌పై దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైందన్నారు. జనగణన పట్టికలో ఇప్పటికే 34 కాలమ్స్ ఉన్నాయని, ఓబీసీ కోసం అదనంగా ఒక కాలం ఏర్పాటు చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఒక్క అదనపు కాలం ఏర్పాటు చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే దేశంలోని బీసీల అభివృద్ధికి ఎలా చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. జనగణనలో కుల గణనను భాగం చేస్తే బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో కొనసాగుతున్న రిజర్వేషన్లను పెంచాల్సి వస్తుందని కేంద్ర పాలకులు భావిస్తున్నారని నాయకులు ఆరోపించారు. అదే విధంగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ మరింత బలపడుతుందనే కారణంతోనే కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. బీసీ కులాలకు దక్కాల్సిన ప్రజాస్వామ్య వాటాను మరెన్నాళ్లు వాయిదా వేస్తారని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు దాటినా, దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు తగిన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు దక్కకపోవడం అన్యాయమన్నారు. దేశంలోని 27 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీసీ కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చాయని, పది రాష్ట్ర ప్రభుత్వాలు సైతం బీసీ జనగణన చేపట్టాలని అసెంబ్లీల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ సమావేశాల్లో కుల గణన చేపడతామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటించినప్పటికీ, కుల గణన విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీల డిమాండ్లను పరిష్కరించకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చి కుల గణన సాధించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, చంద్రగిరి చంద్రమౌళి, పెద్దపల్లి సూరయ్య, గగ్గూరి రాజన్న, ముదిరాజు సేవా సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాగి రాజేష్, రజక సంఘాల జిల్లా అధ్యక్షులు తంగళ్లపల్లి బాపు, పద్మశాలి కుల సంఘ బాధ్యులు చెలిమెల అంజయ్య, సతీష్, వేముల కిరణ్, జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్కల్‌లో ఘనంగా పోషణ్ అభియాన్ - పోషకర వారోత్సవాలు





**మామడ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో పోషకాహార ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్-పోషకర వారోత్సవాలను పొన్కల్ గ్రామంలోని రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారం, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ శ్యామల పోషకాహార విలువలు కలిగిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రయోజనాలను వివరించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు తదితరాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. "ఆరోగ్యకరమైన కుటుంబానికి పోషకాహారమే పునాది" అనే సందేశంతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్యామల, హోమియోపతి మెడికల్ ఆఫీసర్ సంతోషిని, సి సి ఐకెపి భీక్ సింగ్, గ్రామ ఉపసర్పంచ్ వారి పెల్లి రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, విడిసి సభ్యులు శ్రీనివాస్, వార్డు మెంబర్లు లావణ్య,ప్రశాంత్, నాయకులు డీజీవీ నిర్మల్ జిల్లా మీడియా కన్వీనర్ ఎలిగేటి వంశీకృష్ణనేత, నిమ్మ తోట గంగారెడ్డి, చిట్యాల రాజారెడ్డి, బెజ్జంకి రాజా శేఖర్, అంగన్‌వాడీ సిబ్బంది, ఏ ఎన్ ఎం స్వరూప, గంగమణి, ఆశ వర్కర్ సుమలతతో పాటు మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దిమ్మాదుర్తిలో శ్రీహరిరావుకు ఘన స్వాగతం





**మామడ సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. సరస్వతి కాలువ నీటి విడుదలపై గ్రామస్తుల అభినందనలు

**మామడ:** మామడ మండలం దిమ్మాదుర్తి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన శ్రీహరిరావుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇటీవల రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి కాలువలో నీటి విడుదల కోసం ఆయన చేసిన కృషి, చొరవను గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు సాగునీరు అందేలా కృషి చేసినందుకు శ్రీహరిరావును గ్రామస్తులు సన్మానించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి శ్రీహరిరావు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీని రక్షించాల్సిన బాధ్యత స్థానిక ప్రజలదే

**ప్రకృతికి మూలం వృక్షాలే ఎఫ్‌డిఓ కడారి అనిత**



**ఖానాపూర్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** అటవీ నీ రక్షించాల్సిన బాధ్యత స్థానికుల దేనని పర్యావరణానికి మూలం వృక్షాలేనని ప్రకృతి ప్రసాదించిన అడవిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఖానాపూర్ ఫారెస్ట్ డివిజన్ అధికారిని కడారి అనిత అన్నారు పలు ప్రాంతాల్లో అటవీ క్షేత్రాధికారి (ఎఫ్ ఆర్ ఓ )గా పని చేస్తూ నిజాంబాద్ జిల్లా కమ్మరపల్లి నుండి పదోన్నతి పై ఖానాపూర్ ఫారెస్ట్ డివిజన్ అధికారినిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టైగర్ జోన్ పరిధిలో గల ఖానాపూర్ అటవీ డివిజన్లో అపారమైన అడవులతో పాటు అటవీ సంపద కూడా సమృద్ధిగా ఉందని వాటన్నిటిని కాపాడవలసింది ప్రజలేనని అన్నారు అధికారులు కొన్నాళ్లు మీ ప్రాంతాల్లో పనిచేసి తిరిగి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతుంటారని కానీ ప్రజలు ఇక్కడే స్థిర నివాసా జీవనం సాగిస్తున్నందున పర్యావరణాన్ని రక్షిస్తూ మంచి వాతావరణంతో ఆరోగ్యానికి మూలమవుతున్న అటవీని అటవీ సంపాదనను పూర్తిగా కాపాడవలసింది ప్రజలేనని. అన్నారు తమ విధి నిర్వహణలో డివిజన్లోని ప్రజలందరూ అటవి సంరక్షణతో పాటు ఇతరత్రా సూచనలు సలహాలు అందించి తమకు సహకరించాలని కోరారు తెలంగాణ జిల్లాల్లో అత్యంత అడవితో ఆహ్లాద వాతావరణం కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోని అడవి ఒకటని అన్నారు ఖానాపూర్ డివిజన్ పరిధిని సుపారి కేంద్రంగా మార్చి పులుల నివాసాన్ని ఏర్పరచేవిధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని భావితరాల బాగోగులకు అడవి సురక్షితమని ఆరోగ్యపరంగా తిరిగి పాత తరంలా సిటీలో మెలుగుతున్న వారంతా వారంలో ఒక రోజైనా అటవీ ప్రాంతాల్లో ఈ విహార యాత్రలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకునే పరిస్థితి నెలకొందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా అడవిని కాపాడేందుకు, ముఖ్యంగా ఈ ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో ఇప్పటి స్వలాభం వదిలి భావితరానికి లబ్ధి చేకూర్చే విధంగా సహకరించాలని ఎఫ్ డి ఓ అనిత ఖానాపూర్ డివిజన్ ప్రజల్ని పత్రికా ముఖంగా కోరారు.

## 30 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ



**- 2030 నాటికి క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం**
**- డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్**



**మంచిర్యాల, 18, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** 2030 సంవత్సరం నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. శుక్రవారం చెన్నూర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ప్రధానమంత్రి టీబీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి, వారికి సత్వర చికిత్స అందించడంతో పాటు, జిల్లాలోని దాతల సహకా రంతో పోషకాహార కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వినియో గించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వం నిక్షయ్ పోషణ యోజన కింద నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. పోషకాహార కిట్ల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు వ్యాధి ప్రభావాన్ని తగ్గించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీమతి శాంతారాణి, చంద్రకళ జగదీష్, స్థానిక దాతలు కలిసి 30 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రజలందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని డీఎంహెచ్ఓ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ కృష్ణతేజ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, క్షయ వ్యాధి నివారణ కోఆర్డినేటర్ సురేందర్ బాపు, జిల్లా వైద్య బృందం సభ్యులు అల్లాడి శ్రీనివాస్, నామ్‌దేవ్, పుట్ట సత్తయ్య, ధూప్ సింగ్, వెంకట సాయి, ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.





## పొన్కల్ గ్రామంలో గణపతి మండపం వద్ద కోలాట నృత్యం సందడి



**మామడ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గణపతి మండపం వద్ద భక్తులు, మహిళలు, యువత ఆధ్వర్యంలో కోలాట నృత్య కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువత కోలాట కర్రలతో లయబద్ధంగా నృత్యం చేస్తూ సందడి చేశారు. భక్తిగీతాల నడుమ సాగిన కోలాట ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. చిన్నారులు, యువతతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆస్వాదించారు. సంప్రదాయ కళలను కాపాడుతూ, యువతలో సాంస్కృతిక విలువలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

## రైతుల అభివృద్ధే లక్ష్యం..

**సమన్వయంతో ముందుకు సాగాలి**



**మామడ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లా ఆత్మ జనరల్ బాడీ సమావేశంలో కీలక అంశాలపై చర్చ నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను రైతులకు చేరువ చేయడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పంటల సాగులో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే మార్గాలు, రైతులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సమాచారం, సలహాలు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, వ్యవసాయ రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని సమావేశంలో పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆత్మ ద్వారా చేపట్టే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కొండ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమిరెడ్డి, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏడి తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ డైరెక్టర్ రెడ్డి నర్సా రెడ్డితో పాటు ఆత్మ కమిటీ డైరెక్టర్లు మరియు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## అగ్రవర్ణ రాజకీయ ఆధిపత్యాన్ని అంతం చేస్తాం

- రాజ్యాధికారమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న పాదయాత్ర
- బీసీ ఉద్యమ ద్రోహులను ఉపేక్షించేది లేదు
- తెలంగాణ రాజ్యాధికార పార్టీతోనే రాజ్యాధికారం
- పార్టీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ



**మంచిర్యాల, 18, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న రాజ్యాధికారమే లక్ష్యంగా చేపట్టిన రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ పిలుపునిచ్చారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో మహేష్ వర్మ నాయకత్వంలో, బూర రవీందర్ అధ్యక్షతన నస్పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు . ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న రాజ్యాధికారమే లక్ష్యంగా రాజ్యాధికార పాదయాత్రను ప్రారంభించారని తెలిపారు. పార్టీ ఆవిర్భవించిన ఏడాది కాలంలో అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, ప్రజలను చైతన్యం చేయడంలో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ, ఎవరికి వారి వాటా దక్కేలా చేయడమే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా రాజ్యాధికార యాత్ర కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేసే దిశగా జిల్లా, మండల నాయకత్వాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. వచ్చేది బీసీల రాజ్యమేనని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే బహుజనుల రాజ్యాధికారాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్యం చేసి రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించే ఉద్యమ ద్రోహులను ఉపేక్షించేది లేదని మహేష్ వర్మ హెచ్చరించారు. అగ్రవర్ణ నాయకుల రాజకీయ ఆధిపత్యాన్ని అంతం చేసి, రాజ్యాధికారాన్ని ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార యాత్రకు బహుజన వర్గాలు మద్దతు తెలిపి, కలిసికట్టుగా ముందుకు రావాలని, రాజ్యాధికార సాధనలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాకాల దినకర్, పడాల శివతేజ, దాస్యపు దీపక్, మహమ్మద్ లతీఫ్, సీపతి సాయి కుమార్, మండల నాయకులు బొంగోని విద్యాసాగర్, గణవేణి నగేష్, మంతెన సాయిరామ్, తాళ్లపెల్లి రమేష్, షేక్ అక్తర్, జెలంపెల్లి రవి, తాళ్లపెల్లి సంపత్, జెలంపెల్లి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు పేదరికం అడ్డు కాదు

- కూలి బిడ్డ ఎంబిబిఎస్ సీట్ సాధించడం గర్వకారణం
- మాజీ కౌన్సిలర్ సంకరి నిర్మల బాలరాజు

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
విద్యకు పేదరికం అడ్డు కాదని సాయి నగర్ కాలనీకి చెందిన కూలిబిడ్డ ప్రభుత్వ





కోటలో ఎంబీబీఎస్ సీటు సాధించడం, అభినందనీయమని కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం అచ్చంపేట పట్టణం సాయి నగర్ కాలనీకి చెందిన తువ్వాల మల్లయ్య కూతురు గూడేలి ఝాన్సీ నిట్ లో రాణించి ప్రభుత్వ కోటలో ఎంబీబీఎస్ సీట్ సాధించడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. అనంతరం ఝాన్సీ కి శాలువా కప్పి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదని ఝాన్సీ నిరూపించిందని, ఝాన్సీ ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఝాన్సీ డాక్టర్ అయ్యి పేద ప్రజలకు సేవలు అందించాలని సుంకరి నిర్మల బాలరాజు అకాక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సుంకరి నిర్మల బాలరాజ్, రాజు, సుంకరి లింగం, డీలర్ లక్ష్మణ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాడైన గుడ్లు.. చిన్నారులకెలా?

కేటీదొడ్డిలో అంగన్వాడీ కేంద్రంలో నాణ్యతపై స్థానికుల ఆందోళన

ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
జోగులాంబగద్వాల:కేటీదొడ్డి,మండల కేంద్రంలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం



చేస్తున్నారు. పాడైపోయినట్లు కనిపిస్తున్న గుడ్లకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నారులకు అందించే ఆహార పదార్థాల్లో ఇలాంటి గుడ్లు ఎలా పంపిణీ చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.నిబంధనల ప్రకారం నెలకోసారి అందించాల్సిన కోడిగుడ్లను సుమారు 50 రోజులకు ఒకసారి మాత్రమే ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గుడ్ల నాణ్యతను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎంబీ.బీఎస్ సీటు సాధించిన నరేందర్‌కు ఘన సత్కారం

గద్వాల పేరు నిలబెట్టేలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: బీఎస్ కేశవ్:మాజీ మున్సిపల్ చైర్మన్

ఆలంపూర్ సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)
గద్వాల జిల్లా కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన జ్యోతి–నాగరాజ్ దంపతుల కుమారుడు నరేందర్ నారాయణ ఆరోగ్య విశ్వవిద్యాలయం ద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత ఎంబీ.బీఎస్ సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆయనను ఘనంగా



శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా బీఎస్ కేశవ్ మాట్లాడుతూ నరేందర్ సాధించిన విజయం తల్లిదండ్రులకు, గద్వాల ప్రజలకు గర్వకారణమన్నారు. పట్టుదలతో చదివి వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేస్తూ గద్వాల పేరును మరింత ఉన్నతంగా నిలబెట్టాలని నరేందర్‌ను అభినందించారు. నరేందర్ విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ లతా రామకృష్ణ, 21వ వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, 24వ వార్డు కౌన్సిలర్ గువ్వల గోపాల్, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి కిరణ్, కమ్మరి రాము, సాక్రే శ్రీనివాసులు, తిప్పన తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లెలో కూల్చివేసిన దళితుడి ఇంటిని పరిశీలించిన ఎస్సీ,ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య

గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 18:
కూల్చివేసినట్లు ఆరోపణలుఎదుర్కొంటున్న ఇంటిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులు, స్థానికుల నుంచి తెలుసుకున్నారు.





ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, బాధితులకు అండగా ఉంటామని ఘటనపై పూర్తి వివరాలను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చైర్మన్ రేపల్లె గ్రామానికి వచ్చిన సందర్భంగా భీమ్ ఆర్మీ ఉమ్మడిమహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మాచర్ల ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అలాగే ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పూదూర్ చిన్నయ్య చైర్మన్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వివరించారు.కులాంతర వివాహం అనంతరం చోటుచేసుకున్న ఇంటి కూల్చివేత ఘటనపై ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ గ్రామానికి రావడంతో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# మారుమూల ప్రాంతానికీ కమ్యూనికేషన్ సౌకర్యాలు

- నల్లమల్లతో పాటు జిల్లాలో కమ్యూనికేషన్ సౌకర్యాల విస్తరణకు చర్యలు
- మారుమూల ప్రాంతాల్లో 4జీ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

<

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు కలెక్టరేట్, మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ కమ్యూనికేషన్ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు




అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు, భూసేకరణ, అనుమతులు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కమ్యూనికేషన్ టవర్ల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు అందేలా అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాల ద్వారా ప్రభుత్వ సేవలు, అత్యవసర సమాచారం, డిజిటల్ సేవలు ప్రజలకు మరింత సులభంగాఅందుబాటులోకి వస్తాయని తెలిపారు. టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమి, అనుమతుల విషయంలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు



బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మరికంటి, సుధీర్, సురేష్ నరసయ్య, కలెక్టరేట్ విభాగం సూపరిండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు రంగం సిద్ధం

- వెల్టూరులో టీపీఎస్‌కు స్థల పరిశీలన
- రూ.11.75 కోట్లతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో నిర్మాణం

వనపర్తి, సెప్టెంబరు 18 (ప్రజాజ్యోతి): <
పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్



(టీపీఎస్) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రూ.11.75 కోట్ల అంచనా వ్యయంతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో అత్యాధునిక పాఠశాలను నిర్మించనున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వెల్టూరులో పాఠశాల నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో పాఠశాల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. విద్యార్థులకు అనుకూలంగా అవసరమైన మౌలిక వసతులు, ఇతర సౌకర్యాల కల్పనపై సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక బోధనా పద్ధతులు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం అందించడమే టీపీఎస్‌ల లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు సులభంగా చేరుకునేందుకు ప్రత్యేక బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ విదేశాల్లోని విద్యా విధానాలు, బోధనా పద్ధతులను అధ్యయనం చేసే అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడంతోపాటు ఒక్కో విద్యార్థికి సుమారు రూ.1,400 విలువైన కిట్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నాణ్యమైన బోధన, ఆధునిక మౌలిక వసతులు, రవాణా, విద్యా సామగ్రి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలతో సమగ్ర విద్య అందించడమే టీపీఎస్‌ల ఉద్దేశమని



ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే ముచ్చటించి, వారితో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గద్వాల గడ్డపై బీసీ సింహ గర్జన..హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణ

గద్వాల( ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 18:
బీసీల హక్కులు, ఆత్మగౌరవం,సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం గద్వాల గడ్డపై నిర్వహించిన బీసీ సింహ గర్జన కార్యక్రమం విజయవంతమైంది. టీపీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గద్వాల





జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అధ్యక్షత వహించగా, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు,బీసీ సంక్షేమం–అభివృద్ధి అంశాల బాధ్యతలు నిర్వహిస్తున్న వి. హన్మంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారుఈ సందర్భంగా వి. హన్మంతరావు మాట్లాడుతూ, బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ మార్గంలో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల పాటు సభలు, సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యపరిచేకార్యక్రమాలు చేపడతామని,అనంతరం ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించే దిశగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ,బీసీ పిల్లలకు నాణ్యమైన విద్య,యువతకు ఉద్యోగ–ఉపాధి అవకాశాలు,మహిళలకు ఆర్థిక సాధికారత,బీసీ వృత్తులకు ప్రోత్సాహం, జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీసీలలో ఐక్యత, చైతన్యం,సంఘటిత పోరాటంఅవసరమన్నారు.42 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో పాటు బీసీల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి కృష్ణవేణి చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌ను కలిసి ఓబీసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ రుద్ర సంతోష్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ గౌడ్, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్,రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘ్ స్టేట్ చైర్మన్ రాజేందర్ ప్రసాద్ యాదవ్,తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప,టీపీసీసీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, టీపీసీసీ ఓబీసీ కన్వీనర్ ధనలక్ష్మి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రతి కేసును లోతుగా విశ్లేషించి,పునరావృతం కాకుండా చర్యలు:డి ఎం హెచ్ ఓ డా.సంధ్యా కిరణ్మయి

మాతృ మరణాల నివారణకు పటిష్ట చర్యలు

గద్వాల సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లాలో నమోదైన మాతృ మరణాలపై డి ఎం హెచ్ ఓ డా.సంధ్యా కిరణ్మయి ఆధ్వర్యంలో,జిల్లా ఎం హెచ్ ఎన్ ప్రోగ్రాం అధికారి డా.ప్రసూన రాణి పర్యవేక్షణలో మాతృ మరణాల సమగ్ర సమీక్ష నిర్వహించారు. డిఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రత్యేక వైద్య నిపుణులు డా.ప్రియాంక (డి జి ఓ),డా. దామ వంశీ (జనరల్ ఫిజీషియన్)ఈ సమీక్షలో పాల్గొన్నారు.ప్రతి మాతృ మరణ కేసును విడివిడిగా పరిశీలించి, వైద్య, సామాజిక, కుటుంబ,గర్భధారణ,ప్రసవం,ప్రసవానంతర పరిస్థితులకు సంబంధించిన కారణాలను లోతుగా విశ్లేషించారు. ముఖ్యంగా గర్భిణులకు అందుతున్న ఏ ఎన్ సి సేవలు,ప్రమాద గర్భిణుల ముందస్తు గుర్తింపు, రక్తహీనత నివారణ,సకాలంలో రిఫరల్,ప్రసవ సమయంలో అత్యవసర వైద్య సేవలు, ప్రసవానంతర సంరక్షణ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు.ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి,నిర్ణీత సమయంలో ఏ ఎన్ సి పరీక్షలు నిర్వహించాలని,రక్తహీనతను గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించాలని సూచించారు.అధిక ప్రమాద పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడంతో పాటు,ప్రసవానంతరం తల్లి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా గర్భిణులు,ప్రసవానంతర మహిళల్లో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటు,తీవ్రమైన తలనొప్పి,చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,మూర్ఛలు,తీవ్రమైన బలహీనత వంటి ప్రమాద సంకేతాలను కుటుంబ సభ్యులు,ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు సకాలంలో గుర్తించి, వెంటనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు."ప్రతి తల్లి ప్రాణం ఎంతో



విలువైనది.ఒక్క మాతృ మరణం కూడా పునరావృతం కాకుండా క్షేత్రస్థాయి నుంచే నివారణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలి.ప్రతి కేసులోని లోపాలను గుర్తించి,వాటిని సరిదిద్దుతూ మాతృ మరణాల నివారణకు సమష్టిగా కృషి చేయాలి" అని డి ఎం హెచ్ ఓ డా. సంధ్యా కిరణ్మయి పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత వైద్యాధికారులు, సూపర్వైజర్లు,ఏఎన్ఎంలు,ఎస్ ఓ తిరుమల్ రెడ్డి,డి పి హెచ్ ఎన్ ఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ మల్టీస్పెషాలిటీ క్రిటికల్ కేర్ యూనిట్‌ను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని సందర్శించిన ఆయన వైద్యులను అభినందించారు. మహబూబ్‌నగర్ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా వైద్య సహాయం అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు:రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

గద్వాల సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి):
షెడ్యూల్డ్ కులాలు,తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు.అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.షెడ్యూల్డ్ కులాలు,తెగలకు సంబంధించిన భూ సమస్యలు,సర్వీస్ అంశాలు,అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కమిషన్ చైర్మన్,సభ్యులు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్,సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.2 వేల కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించిందన్నారు.ఎస్సీ,ఎస్టీ వర్గాల నివాస ప్రాంతాల్లో సీసీ రహదారులు,డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో కులాంతర వివాహాలను ప్రోత్సహించడంతో పాటు విదేశీ విద్యానిధి పథకానికి ఎప్పటికప్పుడు నిధులు అందేలా ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు.ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అర్హులైన విద్యార్థులకు ఉచిత విద్య అందేలా పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.దళితులు,గిరిజనులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బక్కి వెంకటయ్య సూచించారు.బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు



ఉద్యోగం,వ్యవసాయ భూమి కల్పించేలా ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు సామరస్యంగా జీవించేలా ప్రతి మండలంలో ప్రతినెలా పౌర హక్కుల దినం నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,ఎస్సీ,ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను వంద శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని,ప్రతినెలా అన్ని మండలాల్లో పౌర హక్కుల దినం నిర్వహించేలా చర్యలు చేపడతామని చెప్పారు.గత ఏడాది కాలంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీకి సంబంధించి నమోదైన 53 కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను డీఎస్పీ స్థాయి అధికారులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నామన్నారు.కేసుల సత్వర పరిష్కారానికి అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారని తెలిపారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి పర్యవేక్షణలో జిల్లా స్థాయి ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తరచూ నిర్వహిస్తూ సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.అనంతరం రేపల్లె ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ దళిత సంఘాల నాయకులు కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.ఘటనకు సంబంధించి కేసు నమోదు కావడంతో ప్రభుత్వం నుంచి అందిన పరిహారంలో మొదటి విడతగా రూ.25 వేల చెక్కును కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కలెక్టర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.వివిధ సంఘాల నాయకులు కమిషన్ చైర్మన్,సభ్యులను సన్మానించి పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.అంతకుముందు కమిషన్ చైర్మన్,సభ్యులు రేపల్లె గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఘటనపై





విచారం వ్యక్తం చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్,లక్ష్మీనారాయణ,ఎన్జీవో ఆర్గనైజేషన్ సభ్యుడు గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,అదనపు ఎస్పీ శంకర్,ఆర్డీవో శ్రీనివాసరావు,జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న,శైలజ, మల్లికార్జున్,సురేష్ నాయక్,జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు,కార్పొరేషన్ ఈవో సుదర్శన్,ఎస్టీ అభివృద్ధి అధికారి యాదమ్మ,ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబికి చిక్కిన గోవిందరావుపేట మండల తహాశీల్దార్ సృజన్ కుమార్

- రూ.14 వేలు లంచం తీసుకుంటుండగా తహాశీల్దార్ ను పట్టుకున్న ఏసీబి అధికారులు
- భూమి మార్పిడి కోసం లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం
- ఏసీబి అధికారుల అదుపులో తహాశీల్దార్ సృజన్‌కుమార్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్(ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా గోవిందరావుపేట మండల తహాశీల్దార్ సృజన్ కుమార్ రూ.14 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. భూమి పౌతి మార్పిడి ప్రక్రియ కోసం లంచం డిమాండ్ చేసిన ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తహాశీల్దార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గోవిందరావుపేట మండల తహాశీల్దార్ కార్యాలయంలో ఏసీబి అధికారులు తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు.లంచం తీసుకున్న ఘటనకు సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.భూమి పౌతి మార్పిడి కోసం కుటుంబ సభ్యుల నుండి డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.ఏసీబి అధికారులు తహాశీల్దార్ సృజన్‌కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత కేసు నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు,ఇతర వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గణపతి నవరాత్రుల్లో ఘనంగా కుంకుమ, ధన కలశ పూజలు

- పరకాల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు..
- భారీగా పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు



**పరకాల, సెప్టెంబర్ 18, (ప్రజా జ్యోతి) :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరకాల మండలం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గంప శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎర్ర సుధీర్‌కుమార్, కోశాధికారి ఆకినపెల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిత్య పూజలతో పాటు కుంకుమ, ధన కలశ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ప్రదీప్‌కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా హిందూ సంప్రదాయాలను అనుసరిస్తూ పండుగలను నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. గణపతి నవరాత్రుల్లో మహిళలు కుంకుమ, ధన కలశ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పరకాల పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొలను పల్లి వినాయక భక్త మండలి 10 వేల రూపాయల విలువ గల భజన సామాగ్రి కిట్‌ను అందించిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొలనుపెల్లి గ్రామంలో స్థానిక వినాయక భక్తుల విన్నపం మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10,000 రూపాయలు విలువ కల తాళాలు, తబలా భజన సామాగ్రి కిట్టును రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం అందించిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుబిపరుపతి శ్రీనివాస్ రెడ్డి. ఈ భజన కిట్టును వినాయక భక్తులకు అందించిన వారిలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, చందు రామ్, సంధి దేవేందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి స్థానిక నాయకులు అయిన చిట్యాల వెంకన్న, తోట నరసింగం, తోట యోగనందు, మాచర్ల సోనారి, బళ్లాకారి యాకయ్య, పనికర విజయకుమార్, సత్తూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ చార్జీల నుంచి వ్యవసాయ డీలర్లకు మినహాయింపు ఇవ్వాలి

ఫర్టిలైజర్స్, పురుగుమందులు, విత్తనాల డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు



**హనుమకొండ జిల్లా ప్రతి నిధి, సెప్టెంబర్ 18, (ప్రజా జ్యోతి) :** ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన యూపీఐ లావాదేవీలపై డీలర్లకు విధించే చార్జీల నుంచి మినహాయింపు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో రైతులు డిజిటల్ చెల్లింపులను వినియోగిస్తున్న నేపథ్యంలో డీలర్లపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను సకాలంలో అందించడంలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించిన యూపీఐ చెల్లింపులపై ప్రత్యేక రాయితీ లేదా మినహాయింపు విధానాన్ని అమలు చేయాలని కోరారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలతో సమన్వయం చేసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని నాగుర్ల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

### తెలంగాణ ఎన్ఆర్ఐ కమిషన్ ఏర్పాటు చేయాలని

# సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**రాయపర్తి సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ప్రవాస తెలంగాణవాసుల (ఎంఆర్ఐ) హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ప్రత్యేక తెలంగాణ ఎన్ఆర్ఐ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో కలసి శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తో కలిసి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాస భారతీయుల తరపున ఈ కీలక ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అమెరికా, గల్ఫ్ దేశాలు, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో లక్షలాది మంది తెలంగాణ వాసులు నివసిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు, సాంకేతికత, విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల ద్వారా విశేషంగా తోడ్పడుతున్నారని తెలిపారు. అయితే ప్రవాస తెలంగాణవాసులు మరియు వారి కుటుంబాలు ఆస్తి వివాదాలు, భూ సమస్యలు, న్యాయ సహాయం, అత్యవసర పరిస్థితులు, ప్రభుత్వ శాఖలతో సమన్వయం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా తెలంగాణలో ప్రత్యేక ఎన్ఆర్ఐ కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వినతిపత్రంలో కోరారు. ఈ కమిషన్ ద్వారా ప్రవాస తెలంగాణ వాసుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, పెట్టుబడులకు సింగిల్ విండో విధానం, ఆస్తి రక్షణ, విదేశాల్లో అత్యవసర సమన్వయం, ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఎన్ఆర్ఐ లతో ప్రభుత్వ అనుసంధానం వంటి సేవలు అందించవచ్చని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనను పరిశీలిస్తామని, ప్రవాస తెలంగాణవాసుల సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తుందని పేర్కొన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలంగాణ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా ఈ వినతిపత్రం ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు..

# పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి







- గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలి - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**నడికూడ, సెప్టెంబరు 18, (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ వారి ప్రగతిని మెరుగుపర్చాలని ఆదేశించారు.

నడికూడ మండలంలోని రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్ గ్రామాల్లో శుక్రవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరాను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.రామకృష్ణాపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. కేంద్రం నిర్వహణ, పిల్లలకు అందుతున్న సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న వీఓ భవన పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంఠాత్మకూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, విద్యా ప్రగతిని పరిశీలించారు. వారికి అందిస్తున్న ప్రత్యేక బోధన, కేంద్రంలోని మౌలిక వసతులపై ఉపాధ్యాయులను వివరాలు అడిగారు. అనంతరం పాఠశాల వంటశాలను తనిఖీ చేసి మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా.. గుడ్లు, ఇతర వంట సామగ్రి తగినంతగా నిల్వ ఉన్నాయా అని పరిశీలించారు.

మహ్మద్ షరీఫ్ కుంటను పరిశీలించిన కలెక్టర్.. కుంట పరిరక్షణకు వీఓజీ రాంజీ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 8, 10వ తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల వివరాలను పరిశీలించి, వారు బడికి ఎందుకు రావడం లేదనే కారణాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు నిరంతరం సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందుతున్న సేవల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరును మెరుగుపర్చడంతో పాటు పాఠ్యాంశాలతోపాటు క్రీడలు, సృజనాత్మక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో రామకృష్ణాపూర్ సర్పంచ్ పెండ్లి లక్ష్మి, కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణతో పాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఈజీఎస్, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'సురక్షిత్ జిల్లా'గా తీర్చిదిద్దాలి

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహనతో పాటు ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 18, (ప్రజా జ్యోతి) :** హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. హనుమకొండ జిల్లాను 'సురక్షిత్ జిల్లా'గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

హెచ్ఐవీ, టీబీ, లైంగిక సంక్రమిత వ్యాధులు (ఎస్‌టీఐ), రక్తదానంపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ఐడీఓసీ నుంచి నిట్ హనుమకొండ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్, ఎస్‌టీఐలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, ఎస్‌టీఐ, టీబీ, రక్తదానంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

టీబీ, హెచ్ఐవీ బాధితులను త్వరగా గుర్తించి అవసరమైన చికిత్స అందించడంతో పాటు పోషకాహార కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య మాట్లాడుతూ ప్రతి గర్భిణీ మొదటి, రెండో, మూడో త్రైమాసికాల్లో హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌కు సంబంధించిన మరింత సమాచారం కోసం 1097 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.హెచ్ఐవీ ఉన్నవారిలో టీబీ వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, దగ్గినప్పుడు రక్తం పడటం, అలసట, బరువు తగ్గడం, నీరసం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మాధవరెడ్డి, నెహ్రూనాయక్, హెచ్ఈఈఓ సందెల శ్రీనివాస్, డీపీఎంఓలు రవీందర్, దేవీసింగ్, సువార్త, సబ్ యూనిట్ ఆఫీసర్ విప్లవ్‌కుమార్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, సిబ్బంది, డీపీఎం (డ్యాప్కు) మాధురి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టీవీ ఆసుపత్రి కౌన్సిలర్ రాపర్తి సురేష్, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

భూభారతి దరఖాస్తుల పరిశీలనపై కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆరా





**నడికూడ, సెప్టెంబరు 18, (ప్రజాజ్యోతి) :** రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నడికూడ మండల తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్ రాణి, ఇతర అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డు రూమ్ నిర్వహణ తీరును పరిశీలించి రికార్డుల భద్రత, నిర్వహణకు సంబంధించిన అంశాలపై తహసీల్దార్‌ను ఆరా తీశారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

**నిర్మాణ పనుల పరిశీలన :** నడికూడలో నిర్మాణంలో ఉన్న పాల శీతలీకరణ కేంద్రం భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను కూడా పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ధర్మారం- నడికూడ మధ్య నూతనంగా నిర్మించిన వంతెనను పరిశీలించిన కలెక్టర్.. వంతెన నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో విద్యార్థుల సందడి!

- కొంకపాకలో జోనల్ స్థాయి ఎస్జిఎఫ్ఐ క్రీడలు ప్రారంభం
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి సర్పంచ్ రమాదేవి





**పర్వతగిరి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి) :** క్రీడా మైదానం విద్యార్థుల కేరింతలు, ఉత్సాహంతో సందడిగా మారింది. కొంకపాక ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి ఎస్జిఎఫ్ఐ క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు మండలాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకున్నారు. స్థానిక ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో, మండల విద్యాధికారి అల్లం దాసు బిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాయబారపు రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, ఇవి చదువుల్లోనూ రాణించేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో సమాంతరంగా క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. మండల విద్యాధికారి బిక్షపతి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి పునాది కావాలి అని విద్యార్థులకు సూచిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట, రాయపర్తి మండల విద్యాధికారులు శ్రీధర్, శ్రీనివాసులు, పర్వతగిరి మండల మాజీ విద్యాశాఖాధికారి లింగారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ హరిప్రసాద్, జిల్లా ఎస్జిఎఫ్ఐ కార్యదర్శి అనిల్, జోనల్ కార్యదర్శి మహబూబ్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రఘువీర్, మూడు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను కించపరిచే రచనలను సహించం

- కల్పిత నాయకుడు' పుస్తకాన్ని నిలిపివేయాలి..
- హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి
- పర్వతగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నిరసన



**పర్వతగిరి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కల్పిత నాయకుడు"గా చిత్రీకరిస్తూ ప్రచురితమవుతున్న పుస్తకాన్ని వెంటనే నిలిపివేయాలని, రచయిత హమారా ప్రసాద్‌తో పాటు సంబంధిత ప్రచురణకర్తలు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మండల దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.

శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను కల్పిత వ్యక్తిగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని అవమానించడమేనని అన్నారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా అంబేద్కర్ జీవితాంతం పోరాడారని, విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు, అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ అంబేద్కర్ పోషించిన కీలక పాత్రను గుర్తుచేస్తూ.. ఆయనను కించపరిచే ప్రయత్నాలు రాజ్యాంగ విలువలను, సామాజిక న్యాయ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి రచనలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

**దళిత సంఘాల ప్రధాన డిమాండ్లు :** డాక్టర్ అంబేద్కర్‌ను కించపరిచే అంశాలున్న పుస్తక ప్రచురణ, విక్రయాలపై చట్టపరమైన పరిశీలన చేపట్టాలి. రచయిత, ప్రచురణకర్తలపై చట్టప్రకారం విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలి. చరిత్రను వక్రీకరించే, సామాజిక విద్వేషాలకు దారితీసే ప్రయత్నాలను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. అంబేద్కర్ చరిత్ర, ఆలోచనలు, రాజ్యాంగ విలువలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చరిత్రను ఏ ఒక్కరి రచనలతోనూ చెరిపివేయలేరు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత చిన్నపాక శ్రీనివాస్, ఆర్ఎస్‌పీ వల్లందాస్ కుమార్, స్వేరోస్ జిల్లా నాయకులు గారే జయరాజ్, అంబేద్కర్ ఫిలాసఫీ అవార్డు గ్రహీత జంగిలి బాబు, మండల అధ్యక్షుడు నరకుడు రవీందర్, సీనియర్ నాయకులు దబ్బట నరసయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బోట్ల కుమార్, స్వేరో సీనియర్ నాయకులు జంగిలి యాకయ్య, కందికట్ల ప్రవీణ్, చెడుపాక సిద్ధార్థ, బొట్ల కనకరాజు, కేవీపీఎస్ మండల నాయకులు జిల్లా రమేష్, వల్లందాస్ వెంకన్న, చెడుపాక కుమారస్వామి, చిన్నపాక శ్రీకాంత్, వల్లందాస్ చిన్న రంగయ్య, గడ్డం యాకాంబరం, బొట్ల భాస్కర్, జీడి వలరాజు, బోట్ల వెంకన్న, పసుల శ్రీనివాస్, వర్షం కుమారస్వామి, ఆబర్ల రవి, వర్షం ఆనంద్, చిర్ర సునీల్, పసుల కుమార్, కొయ్యల రవికుమార్, బరిగల నవీన్, హర్షం యాకయ్య, ఆబర్ల యాకరాజు, చిన్నపెల్లి దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# గరిడేపల్లి చెరువులో నీటి కుక్కల సందడి

ఆసక్తిగా తిలకించిన స్థానికులు.. సెల్‌ఫోన్లలో చిత్రీకరణ

నాగార్జునసాగర్‌లో కనిపించే అరుదైన దృశ్యం మండల కేంద్రంలో ప్రత్యక్షం

గరిడేపల్లి,సెప్టెంబర్ 18,(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని గరిడేపల్లి తాళ్లచెరువులో గురువారం నీటి కుక్కలు(ఒటర్లు) సందడి చేశా యి.చెరువులో నీటిపై వేగంగా ఈదుతూ,అప్పుడప్పుడు ఒడ్డు కు వచ్చి సంచరిస్తూ కనిపించడం తో స్థానికులు,అటుగా వెళ్తున్న ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పలువురు



వాటిని తమ సెల్‌ఫో న్లలో చిత్రీకరించారు.సాధారణం గా నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే నీటి కుక్కలు తాజాగా గరిడేపల్లి తాళ్లచెరువుతో పాటు రావిచెరు వు,పొనుగోడు చెరువుల్లోనూ కనిపిస్తున్నట్లు స్థానికులు తెలిపా రు.చెరువుల్లో నీటి లభ్యతతో పాటు వాటికి అవసరమైన ఆహారం సమృద్ధిగా ఉండటం తోనే ఇవి ఈ ప్రాంతాలకు వచ్చినట్లు చెరువు చైర్మన్ చామకూరి దశరథ్ తెలిపారు. అరుదుగా కనిపించే ఈ వన్యప్రాణులు మండల కేంద్రంలోని చెరువుల్లో ప్రత్యక్షం కావడంతో స్థానికుల్లో ఆసక్తి నెలకొంది.నీటి కుక్కల సంచారానికి ఎలాంటి ఆటంకం కలగకుండా వాటి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.

## ఉచిత కంటి పరీక్షల శిబిరం ప్రారంభం

సర్పంచ్ మొగాలగాని నరసయ్య

ఆలేరు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శర్బనాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సురేఖ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్ హైదరాబాదు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు



ఉచిత కమిటీ పరీక్షల శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మొగలగాని నర్సయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించమని డాక్టర్ ఉమామహేశ్వర్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరికి అతి త్వరలో పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మౌనిక సురేష్, పంచాయతీ కార్యదర్శి కనకరాజు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై వివాదాస్పద పుస్తకం.. హమారా ప్రసాద్ అరెస్ట్ పై హర్షం

★ చట్టపరమైన చర్యలను స్వాగతిస్తున్నాం: చింతకుంట్ల వెంకన్న

తుంగతుర్తి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు, పుస్తక ప్రచురణకు సంబంధించిన వ్యవహారంలో హమారా ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచే ప్రక్రియ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న తెలిపారు. శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ... ఈ విషయంలో చట్టపరమైన చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.అంబేద్కర్ ను అవమానించేలా ఉన్నాయని



ఆరోపణలు ఎదుర్కొంటున్న పుస్తక ప్రచురణ, ఆవిష్కరణ అంశంపై దళిత, బహుజన సంఘాలు ప్రజాస్వామ్య పద్ధతిలో, ఎలాంటి అల్లర్లకు తావులేకుండా శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశాయని వెంకన్న పేర్కొన్నారు. ఈ క్రమంలో అరెస్టు వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన దళిత సంఘాల నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించిందని, రాజ్యాంగంపై జరిగే చర్చలు, విమర్శలు సైతం చట్టపరమైన హద్దుల్లోనే ఉండాలని అన్నారు. అంబేద్కర్‌పై వివాదాస్పదంగా ఉన్న పుస్తకాన్ని విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం రచయిత అరెస్టు, పుస్తక ప్రతుల స్వాధీనం తదితర చర్యలను కోర్టుకు వివరించింది. అంబేద్కర్‌పై విమర్శల పేరుతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరిగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని వెంకన్న అన్నారు.దళిత, బహుజన వర్గాలు——ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు——తమ హక్కులు, రాజ్యాంగ విలువల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వ్యక్తులపై దూషణలకు కాకుండా రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో ఉద్యమాలు నిర్వహించడం ద్వారానే ప్రజాస్వామ్య విలువలను కాపాడగలమని తెలిపారు.హైకోర్టు పరిణామాలు, పోలీసుల చర్యలు చట్టపర మైన ప్రక్రియలో భాగమని పేర్కొంటూ, ఈ వ్యవహారంలో తదుపరి నిర్ణయాలు న్యాయస్థానాల పరిధిలోనే ఉంటాయని తెలిపారు.

## హోమియో ఆసుపత్రిపై నిర్లక్ష్యం ఎందుకు?

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి): పోచంపల్లి ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో వెంటనే రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీవైఎల్ పట్టణ కార్యదర్శి పగడాల శివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. గత నాలుగేళ్లుగా రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం, మందుల నిల్వల్లో గడువు ముగిసిన మందులు ఉండటం, సిబ్బందికి 11 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే వైద్యుడిని నియమించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, పీవైఎల్ నాయకులు మేకల వెంకటేష్, కొత్తబాబు, రచ్చ వెంకటేష్, గోరుగంటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

**యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి ఆలయ ఆదాయంలో వాటా ఇవ్వాలి**

**ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి:**

**ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

ఆలేరు సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవ ర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలకు తగిన స్థాయిలో నిధులు కేటాయించి అభివృద్ధికి సహక రించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ లకు ఆదాయ వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ ప్రజలకు మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సేవలను అందిస్తున్నాయని తెలిపారు.యాదగిరిగుట్టకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, యాదగిరిగుట్ట ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన అనేక సేవలను మున్సిపాలిటీ అందిస్తోందని తెలిపారు. గతంలో యాదగిరిగుట్ట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఆలయ ఆదాయంలో 30 శాతం వరకు గ్రామ పంచాయతీకి కేటాయించేవా రని, ప్రస్తుతం మున్సిపాలిటీగా మారిన తర్వాత ఆ విధమైన ఆదాయ వాటా అందడం లేదని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి స్వంత ఆదాయం పరిమితంగా ఉన్నందున ఆలయ ఆదాయం నుంచి నిధులు కేటాయించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం భూసేకర ణలో భాగంగా ఇళ్లు, షాపులు, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సైదాపూర్‌లోని 329.314 సర్వే నంబర్ పరిధిలో ఉన్న అర్హులైన వారికి పట్టాలు అందించాలని కోరారు. గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.యాదగిరిగుట్ట అభివృద్ధి పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణం కారణంగా సుమారు 200 మంది వ్యాపారులు తమ షాపుల వారికి ఉపాధి తగ్గిందని తెలిపారు. షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని,



బాధితుల జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదగిరిగుట్టను సందర్శించిన సమయంలో బ్రిడ్జి తొలగింపు చేస్తామని బాధితుల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని తెలిపారు.ఆలేరు మున్సిపాలిటీ పేరుకే మున్సిపాలిటీగా ఉండకుండా అవసరమైన నిధులు కేటాయించి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ని బీర్ల అయిలయ్య కోరారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం ఆలేరు ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని, ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజక వర్గం ముందంజలో ఉందని, లబ్ధిదారులు సొంత ఇళ్లు నిర్మించుకొని సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించి, ప్రజల చిరకాల సమస్యలను పరిష్క రించాలని కోరారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య ప్రస్తావనకు కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఉథం ఇచ్చారు. యాదగిరిగుట్ట దేవాలయానికి రోజుకు లక్ష మంది భక్తులు వస్తున్నారని అందుకే మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలని కోరుతూ 200 షాపులకు ఇబ్బంది కరంగా ఉన్న బ్రిడ్జిని తొలగించాలని కోరారు అదేవిధంగా ఆలేరు రెవెన్యూ డివిజన్ గా మార్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలిపారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నిజమైన వారసులు కమ్యూనిస్టులే

షేక్ బందగి త్యాగం దొర ఇసునూరి రామచంద్రారెడ్డి పతనం సాయుధ పోరాట ప్రతిరూపం

ఆలేరు సెప్టెంబర్ 18( ప్రజా జ్యోతి) యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో గురువారం రాత్రి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆలేరు పట్టణానికి వచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లా బస్సుయాత్ర బృందం పట్టణంలో అమరవీరులకు స్థానిక బస్టాండ్ వద్ద నివాళులర్పించారు. ముందుగా సిపిఎం పట్టణ సీనియర్ నాయకులు ఘనగాని మల్లేశం గారు జండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి ఎంఎ ఇక్బాల్ అధ్యక్షతన సభ



జరిగింది ఈ సభకు హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జహంగీర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులు అని భారతదేశ చరిత్రలో సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామ్య హక్కుల కోసం, దొపిడికి, వెట్టి చాకిరి వ్యతిరేకంగా విముక్తి సాగిన గొప్ప ప్రజా ఉద్యమాలలో ఒకటని అన్నారు. నిజాం పాలనలోని భూస్వామ్య వ్యవస్థలో రైతులు, కూలీలు, పేద ప్రజలు ఎదుర్కొన్న వెట్టి చాకిరీ, అక్రమ పన్నులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలు సంఘటితమై పోరాటం సాగించారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం లో అనేకమంది బలిదానాలతో పది లక్షల ఎకరాల భూమి రైతులకు పంచబడిందని వ్యక్తి చాకిరిని నిర్మూలించబడిందని కౌలుదారు రక్షణ చట్టం తీసుకువ చ్చారని అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఈ పోరాట ప్రభావంతో దున్నేవానికి భూమి అని నినాదం భారతదేశ వ్యాప్తంగా వ్యాపించినది అన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ ఈ పోరాటం హిందూ ముస్లింల పోరాటంగా చరిత్రను వక్రీకరించే కుటిల ప్రయత్నం చేస్తున్నారని శవాల మీద పేలాలు ఎదుర్కునే విధంగా అమరవీరుల రక్తంతో తడిసిన ఈ నెలలో ఓట్లు దండుకోవడం కోసం బిజెపి పాలకులు నీచ రాజకీయగలకు పాల్పడుతున్నారని అన్నారు ఈ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పత్రికలో వార్తలు రాసినందుకు నిజాం రజాకార్లు గుండాలు చేతిలో అతి కిరాతకంగా హత్య చేయబడ్డ షోయబుల్లా ఖాన్ ఏ మతం అని ఆయన ప్రశ్నించారు నిజాంకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లి నిజాంపైనే దావా గెలిచిన అక్కసుతో దొరల చేతిలో బలి అయిన షేక్ బంధ వీధి ఏ మతం అని ఆయన ప్రశ్నించారు లక్షల ఎకరాల భూమి చేతిలో పెట్టుకొని అరాచకాలు సాగిస్తు సాయుధ రైతాంగ వీరుల చేతిలో హతం చేయబడ్డ ఇస్నూరి రామచంద్ర రెడ్డిది ఏ మతం అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటం కులాల మధ్య మతాల మధ్య జరిగిన పోరాటం కాదని తెలంగాణ ప్రాంత విముక్తి కొరకు వ్యక్తి చాకిరి కి వ్యతిరేకంగా బానిసత్వానికి వ్యతిరేకంగా భాషా సంస్కృతిలపై దాడికి వ్యతిరేకంగా జరిగిన ఒక మహోత్సరమైన పోరాటమని ఆ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులని ఈ మధ్యలో పుట్టిన ప్రతి బిడ్డకు ఆ విషయం తెలుసా అని 50 సంవత్సరాలు గడిచిపోయింది చరిత్ర అంతా మర్చిపోయారు అని బిజెపి పాలకులు చరిత్రను వక్రీకరించే విధంగా నీచ రాజకీయాలు చేస్తే తెలంగాణ సాయుధ పోరాట అమరుల రక్తం మరుగుతుందని వాళ్ళ వారసుల చేతిలో బిజెపికి ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులకు గుణపాఠం తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాటూరి బాలరాజు దాసరి పాండు సిపిఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ మోరి గాడి చంద్రశేఖర్ పట్టణ నాయకులు మోరిగాడి రమేష్ మండల నాయకులు జూకంటి పౌలు డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్ బుర్రు అనిల్ వడ్డేమాన్ బాలరాజు మోరీగాడి అజయ్ కాసుల నరేష్ చేన్న రాజేష్ డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు యాసారపు ప్రసాద్ వడ్డేమాన్ విప్లవ్ మాదాని నవీన్ ఎండి మథిన్ ఎండి ఖలీల్ కటకం సుదర్శన్ కొరటూరి ఉపేందర్ బొమ్మ కంటి లక్ష్మీనారాయణ మహిళా సంఘం నాయకులు మొరిగాడి స్వరూప మొరిగాడి భాగ్యలక్ష్మి కో ఆప్షన్ సభ్యురాలు ఇంతియాజ్ ఇర్ఫానా మురిగాడి స్వరూప ఘనగాని భాగ్యమ్మ అంజమ్మ మైలారం కళ్యాణి అయిలి చంద్రకళ శ్వేత శ్వేత తెల్ల మోహన్ పరుష నాగరాజు మిట్ట శంకరయ్య గనగాని రాజు కోల సదానందం కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలపై "సమరానికి సిద్ధం"

పోచంపల్లిలో ప్రచార గోడపత్రికల ఆవిష్కరణ

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి): ఖమ్మంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీవైఎల్ పోచంపల్లి పట్టణ కార్యదర్శి పగడాల శివ పిలుపునిచ్చారు. శుక్రవారం పోచంపల్లి మండల కేంద్రంలో మహాసభల ప్రచార గోడపత్రికలను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వాల రైతు




వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిట్టుబాటు ధర, కౌలు రైతుల సమస్యలు, గ్రామీణ ఉపాధి అవకాశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, కూలీలు, యువత, ప్రజాస్వా మికవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్త బాబు, రచ్చ వెంకటేష్, అచ్చయ్య, తంగిర సత్తయ్య, మేకల వెంకటేష్, ఆర్.ఉదయ్, పోతగల బాలయ్య, గోరుగంటి లింగయ్య, చింత లక్ష్మయ్య, గంటీల బాలయ్య, రావుల చిన్నయ్య, చింతకింది నగేష్, చీరాల నర్సింహా, గుండెగోని నర్సింహా, రావుల పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులతో మమేకమైన వ్యవసాయ విద్యార్థులు

గరిడేపల్లి,సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి): గ్రామీణ కృషి అనుభవ కార్యక్ర మం (రావే)లో భాగంగా చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సి టీ, హైదరాబాద్‌కు చెందిన బీఎస్సీ వ్యవసాయ విద్యార్థినులు పొనుగోడులో రైతుల సమస్యలు వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనం చేశారు.గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పిఆర్ఏ) ద్వారా



గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.గ్రామం లోని వనరులు,నీటి వనరులు, పంటల సాగు,దిగుబడులు, చీడపీడల నివారణ పద్ధతులను గ్రామ పటం,వెన్ డయాగ్రామ్, పైచార్ట్, చిత్రాల ద్వారా ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయం,సమగ్ర వ్యవసాయ విధానాలపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ మాట్లాడుతూ..క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక వ్యవసాయ పరిజ్ఞానం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేణు, కేవీకే శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, ఎన్.సుగంధి,ఏఈఓ మనోజ్ కుమార్,పంచా యతీ కార్యదర్శి ఆదినారాయణ,రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

★ కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

గరిడేపల్లి,సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జిఎఫ్)





నియోజకవర్గ స్థాయి బాలబాలికల అండర్ 14,17 కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు విద్యార్థులు క్రీడా రంగంలో తమ ప్రతిభ ను చాటుతూ మన ప్రాంతానికి,మన రాష్ట్రానికి,మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వం తో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపా రు.క్రీడాకారులకు అవసర మైన ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి,వారికి అవసరమైన వేదికలు కల్పించడం ద్వారా భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దాలని అన్నారు. గెలుపు,ఓటమిని సమానంగా స్వీకరించే మనోభావాన్ని క్రీడలు నేర్పుతాయన్నారు నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్ కావునా ప్రతి ఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కను నాటారు.అనారో గ్యంతో మృతి చెందిన అప్పన్నపేట గ్రామానికి చెందిన పెండెం భిక్షం కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రు నాయక్,ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపుర అంజన్ రెడ్డి,మాజీ ఎంపీపీ పైడిమరి రంగనాథ్,సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య,జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, జుట్టుకొండ సత్యనారాయణ,చాంద్ మియా,బండ నర్సిరెడ్డి,సర్పంచులు, ఏడు మండలాల పీడీలు, ఉపాధ్యాయు ని,ఉపాధ్యాయురాల్లు,సిఆర్పిలు రామకృష్ణ,అశోక్ విద్యార్థులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో యూనిఫామ్‌ల నాణ్యత పరిశీలన

పెన్ పహాడ్, సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే ఉచిత యూనిఫామ్‌ల రూపకల్పనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పెన్ పహాడ్ ఏరియా ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం) అంజయ్య సూచించారు. మండల పరిధిలోని అనాజిపురం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల కొరకు మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో కుట్టిన ఉచిత యూనిఫామ్ దుస్తులను ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుస్తుల కుట్టు విధానాన్ని, వస్త్ర నాణ్యతను దగ్గరుండి




తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏపీఎం అంజయ్య విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. మహిళా సమైక్య సభ్యులు కుట్టిన దుస్తుల ఫిట్టింగ్ ఎలా ఉంది, సైజులు సరిగ్గా సరిపోయాయా లేదా అనే అంశాలపై విద్యార్థుల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. దుస్తుల నాణ్యత పట్ల విద్యార్థులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అందిస్తున్న ఉచిత యూనిఫామ్‌లను మహిళా సంఘాల సభ్యులు ఎంతో బాధ్యతగా, సకాలంలో పూర్తి చేయడం అభినందనీయమ న్నారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులంద రికీ దుస్తులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ఇటువంటి అవకాశాలను కల్పిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకుని సంఘాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులు క్రమశిక్ష ణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు, ప్రతినిధులు, సీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడవి జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

వేటగాళ్లపై నిఘా.. చెట్ల నరికివేతకు పాల్పడితే కఠిన చర్యలు

ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) సెప్టెంబర్. 18:

ఇందల్వాయి: మండల పరిధిలోని డొంకల్–కొటాలపల్లి అడవి ప్రాంతంలో అటవీ జంతువుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అడవిలో సంచరిస్తున్న వన్యప్రాణుల స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తున్నారు. ఈ





క్రమంలో ఎఫ్ఆర్వో రవిమోహన్ బట్, బీట్ ఆఫీసర్ ప్రభాకర్ అడవి ప్రాంతంలో పర్యటించి వన్యప్రాణుల సంచారం, వాటి బాగోగులను పరిశీలించారు. అడవిలో వేటగాళ్ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అడవులను, వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. అక్రమంగా చెట్లను నరికివేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అడవిలో వేటకు పాల్పడినా, వన్యప్రాణులకు హాని కలిగించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అటవీ సంపదను కాపాడుతూ వన్యప్రాణులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీరాజ్, శ్రీకాంత్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కుట్టుమిషన్ల దరఖాస్తుల గడువు పొడగింపు

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :

తెలంగాణ ప్రభుత్వం బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టుమిషన్ల పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడగించినట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఆటోమెటిక్ కుట్టుమిషన్ల నూరు శాతం సబ్సిడీతో ఆన్ లైన్ లో దరఖాస్తులను ఈ నెల 30 వరకు http://tgobmms.cgg.gov.in వెబ్ సెట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులకు, అనాథ మహిళలకు, మేర కులస్తులకు, ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కచ్చితంగా తెల్లరేషన్ కార్డు కలిగిన వారికే, 5వ తరగతి పాసైన వారికి అవకాశమని తెలిపారు. కుటుంబ వార్షిక ఆధాయం గ్రామీణ ప్రాంతాల్లో 1,50,000, పట్టణ వాసులకు రూ.2,00,000లకు లోబడిన వారు అర్హులన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం, షూల పంపిణీ

కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి :

కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫాం, షూలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, విద్యార్థులను పాఠశాల విద్య వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా యూనిఫాం, షూలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, షూలను అందజేసి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గ్రామ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప



సర్పంచ్ సిద్ధం స్వామి, సెక్రెటరీ రవీందర్ రావు వార్డు సభ్యులు మల్లీ మనవ్వ, దుబ్బాక సంతోష్, అజిత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు వేద, రంజిత, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ

కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):

కామారెడ్డి జిల్లా ముత్యంపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వైద్య సేవలతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి రూమ్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవలు అందించే ప్రదేశంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైనది. ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా స్వచ్ఛంగా



అన్నారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల తీరుపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

రోగులకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందేలా సిబ్బంది. బాధ్యతతో పనిచేయాలి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఆస్పత్రి ప్రాంగణం, స్టోర్ ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని సూచించారు. ఔషధాల నిల్వలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు సకాలంలో మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పై నమ్మకంతో వచ్చేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలి. ప్రతి రోగితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలి. అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిఎంమెన్ హెచ్ ఓ వెంకట్, సర్పంచ్ స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: భానుప్రియ

ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 18:

ఇందల్వాయి: మండల కేంద్రంలోని తిరుమల్ పల్లి సబ్ సెంటర్ పరిధిలోని గంగారం తండా గ్రామపంచాయతీలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సెకండ్ ఏఎన్ఎం భానుప్రియ, ఆశా వర్కర్ జ్యోతి ఆధ్వర్యంలో గ్రామంలోని పరిసరాలను పరిశీలించి, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి





ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎం భానుప్రియ మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్ల చుట్టూ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది అనేక అనారోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విషజ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని భానుప్రియ సూచించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై ఇళ్లలో, పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించి దోమల నివారణకు సహకరించాలని ఆమె కోరారు. ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

## ఉగ్రవాయిలో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం

కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 17 ప్రజా జ్యోతి:

కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో అంబేద్కర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గురువారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



అన్నప్రసాద కార్యక్రమానికి ధాతగా, గౌరవ అతిథిగా శ్రీ పటేండ్ల మనోహర్ గారు వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన సేవలను అభినందించారు. అన్నదానానికి సహకరించిన శ్రీ పటేండ్ల మనోహర్ గారిని, ఆయన కుటుంబ సభ్యులను భగవంతుడు ఎల్లప్పుడూ చల్లగా చూడాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గ్రామ పెద్దలు, అంబేద్కర్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సమన్వయంతో నిర్వహించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



## హత్నూర లో దళిత జర్నలిస్టుల ఫోరం కరపత్రం ఆవిష్కరణ

హత్నూర 18 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)

అక్టోబర్ 2026 న సంగారెడ్డిలో నిర్వహించనున్న దళిత జర్నలిస్టుల ఫోరమ్ 11వ రాష్ట్ర మహాసభల కరపత్రిక ను శుక్రవారం నాడు హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఇంచార్జ్ ఎంపీడీవో మహమ్మద్ యూసుఫ్,ఎస్సై శ్రీధర్ రెడ్డి లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దళిత



జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు తలారి యాదగిరి మాట్లాడుతూ దళిత జర్నలిస్టులు నిత్యం ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా సేవలు అందిస్తున్నప్పటికీ ఎలాంటి సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని అన్నారు. వర్కింగ్ దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం అభయహస్తం కింద రూ:12లక్షలు,హెల్త్ కార్డులు,ఇల్లస్థలాలు,ఇండ్లు మంజూరు చేయాలి అన్నారు.నిజాయితీగా వృత్తికి న్యాయం చేస్తున్నా దుర్భర జీవనంలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. సంగారెడ్డిలో జరుగు రాష్ట్ర 11 వ మహాసభలలో దళిత జర్నలిస్టుల సంక్షేమ పథకాలను అమలు చేయాలన్న డిమాండ్లు ప్రవేశపెట్టనున్నామని అన్నారు.జిల్లాలోని ప్రతి దళిత జర్నలిస్టు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవదాస్,ఉమ్మడి మెదక్ అధ్యక్షులు రేపాక విజయ్ రాజు, జిల్లాకమిటి సలహాదారు మీనంపల్లి కిషన్ రావు,జిల్లాకార్యదర్శి ముక్కగళ్ళ యాదన్న ,కార్య వర్గ సభ్యులు పరమేశుల కృష్ణ ,ఆవుల మల్లేశం తదితరులు ఉన్నారు.

## వట్పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రతి అర్హత కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వట్పల్లి, ప్రజా జ్యోతిసెప్టెంబర్ 18 ): వట్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలానికి మొత్తం 9,348 స్మార్ట్ రేషన్ కార్డులు అందగా, అర్హులైన కార్డుదారులకు వాటిని పంపిణీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా వట్పల్లి గ్రామానికి చెందిన కార్డుదారులు పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించారు. రేషన్ కార్డు ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు.

## ఐదవ రోజు.. విఘ్నేశ్వరుని సన్నిధిలో వసంతోసేవా కార్యక్రమం

జహీరాబాద్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి న్యూస్ )

వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఐదో రోజు ఏర్పాటు చేసిన గణనాథుని మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మరియు టిఆర్ఎస్ నాయకులు జహీరాబాద్ పట్టణం 25వ



వార్డు కౌన్సిలర్ జాకీర్, విజేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు వినాయకుడి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే శ్రీ గణనాథుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ సందర్భంగా మండపంలో విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాల తో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు పాల్గొన్నారు. సమాజానికి సేవ చేయడం గణనాథునికి సమర్పించే గొప్ప భక్తి ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు నాహృదయ పూర్వక అభినందనలు అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, కౌన్సిలర్ లు అబ్దుల్లా, మహిపాల్, గౌస్ గోరి, పాండు, నాయకులు చిన్న రెడ్డి, అనుషమ్మ, గణేష్, సిరాజ్, చంద్రయ్య, ఇస్మాయిల్, పాండు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పొదుపే మహిళల ఆర్థిక బలం.. స్వయం ఉపాధితో స్వావలంబన సాధించాలి :రాష్ట్ర ఆర్పీ సంధ్యారాణి

బీబీపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ .

పొదుపుతో కుటుంబానికి అండ.. రుణాలతో స్వయం ఉపాధికి బాట. ఏపిఎం వంశీకృష్ణ

కల్హేర్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):

కల్హేర్ మండలం బీబీపేట గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్పీ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా క్రమం తప్పకుండా పొదుపు చేయడంతో పాటు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏపీఎం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మహిళ పొదుపును జీవితంలో ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధమైన పొదుపు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే 'మినీ బ్యాంకు' వంటిదని తెలిపారు. సంఘాలకు సంబంధించిన పొదుపు, లావాదేవీలు, ఖర్చులను సక్రమంగా నిర్వహిస్తూ, అవసరమైన చెల్లింపులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, శ్రీశక్తి నిధులను సద్వినియోగం చేసుకొని కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న ప్రతి సహాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని



ఆర్థికంగా ఎదగాలని వంశీకృష్ణ సూచించారు. మహిళా సంఘాలు ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచేలా క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వంశీకృష్ణ, సీఏ అపర్ణ, సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కల్హేర్‌లో గణేష్ నిమజ్జనంపై పోలీసుల కఠిన హెచ్చరికలు

భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి: ఎస్ఐ రవిగౌడ్

కల్హేర్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి ):

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్ గణేష్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా నిర్వాహకులు డీజే కోసం ముందస్తుగా డబ్బులు చెల్లించి ఉంటే పోలీసులను సంప్రదించాలని, సంబంధిత డీజే నిర్వాహకుల నుంచి ఆ మొత్తాన్ని తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. నిమజ్జన ఊరేగింపు సమయంలోగానీ, గణేష్ మండపాల వద్దగానీ డీజే ఏర్పాటు చేస్తే డీజేను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులు, డీజే యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే నిమజ్జనం సందర్భంగా మండపాల వద్ద మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ సోదరభావంతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.



## సిబ్బంది జీతాల సమస్యను పరిష్కరించండి

మున్సిపల్ శాఖ కార్యదర్శికి జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ వినతి

జిన్నారం(ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 18:

జిన్నారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న వివిధ విభాగాల సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇకపై నెలనెలా జీతాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పాలకవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవికి మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మెమోరాండం అందజేశారు. జిన్నారం మున్సిపాలిటీలో పారిశుధ్యం, కార్యాలయ నిర్వహణ, ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వేతనాలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాలకవర్గం కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా సిబ్బంది కుటుంబ అవసరాలను తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించింది.

## బాలికను వేధించిన నిందితుడికి 2 ఏళ్ల జైలు శిక్ష

మెదక్ (ప్రజాజ్యోతి):
బాలికను వెంటాడుతూ, బెదిరింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాలు: మెదక్ పట్టణానికి చెందిన రాహుల్ అనే వ్యక్తి 17 ఏళ్ల బాలికను వెంటాడుతూ, తనతో మాట్లాడకపోతే చనిపోతానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాలికతో దిగిన ఫోటోను వాట్సాప్ స్టేటస్, డీపీగా పెట్టుకుని 'నా భార్య' అని రాసి వేధింపులకు గురిచేశాడు. ఈ వేధింపుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక హాని చేసుకునే ప్రయత్నం చేసింది. విచారణ మరియు తీర్పు: ఈ ఘటనపై అప్పటి మెదక్ టౌన్ సీఐ మధు 2022 అక్టోబర్‌లో కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మల్లారెడ్డి పూర్తి సాక్ష్యాధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్ష, రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎస్పీ హెచ్చరిక: ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. బాలికలను వేధించడం, వెంటాడడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్సై విటల్ కానిస్టేబుల్ కృష్ణ గౌడ్ సిడిఓ రామయ్య లీగల్ అడ్వైజర్ శ్వేత సహకరించారని ఎస్పీ తెలిపారు కేసు దర్యాప్తు విచారణలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



## విద్యుత్ షాక్‌తో మహిళా రైతు దుర్మరణం

మెదక్ (ప్రజా జ్యోతి)
మహిళా రైతు తాగునీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బోరుబావిపై పడి విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళా రైతు మృతి చెందిన విషాద సంఘటన పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బద్ధం శోభారాణి (51) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసేందుకు వెళ్లిన శోభారాణి రోజంతా వ్యవసాయ పనులు చేశారు. పని చేసి అలసిపోవడంతో గొంతు తడుపుకునేందుకు తాగునీటి కోసం సమీపంలోని మరో వ్యక్తికి చెందిన వ్యవసాయ క్షేత్రంలోని బోరుబావి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బోరుబావిపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.



## 28వ వార్డులో 'డ్రై డే' అవగాహన కార్యక్రమం

మెదక్ (ప్రజా జ్యోతి)
మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో దోమల నివారణ మరియు సీజనల్ వ్యాధుల అరికట్టే లక్ష్యంతో 'శుక్రవారం – డ్రై డే' ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని కౌన్సిలర్ ఇప్ప అఖిల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. అవగాహన





ముఖ్యాంశాలు: నిల్వ నీటి తొలగింపు ఇళ్లలోని కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పూల కుండీలు మరియు ఓపెన్ ట్యాంకుల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని సూచించారు. వ్యాధుల నివారణ: పరిసరాల్లో నీరు నిలిచి ఉంటే డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు పెరుగుతాయని హెచ్చరించారు. వారానికి 10 నిమిషాలు: ప్రతి శుక్రవారం కనీసం 10 నిమిషాల సమయాన్ని కేటాయించి, మన ఇంటి పరిసరాలను పరిశీలించి శుభ్రం చేసుకోవాలని కోరారు. "మన ఆరోగ్యం – మన బాధ్యత" అనే నినాదంతో 28వ వార్డును దోమల రహిత, పరిశుభ్రమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కౌన్సిలర్ ఇప్ప అఖిల భరత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వార్డు ప్రజల సహకారంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని తెలియజేశారు.

## కొబ్బరికాయలో కొలువుదీరిన గణపయ్య



గజ్వేల్, సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి):
భక్తికి కళాసృజనాత్మకతను జోడిస్తూ, భగవంతునికి పవిత్రంగా సమర్పించే కొబ్బరికాయపై గణపతి రూపాన్ని అద్భుతంగా చిత్రించి శుక్రవారం నాడు ఆవిష్కరించి భక్తిని చాటుకున్న గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. వినాయక నవరాత్రుల సందర్భంగా గణపతిపై తనకున్న భక్తిభావాన్ని వినూత్న ఆలోచనతో కళారూపంగా ఆవిష్కరించినట్లు రామకోటి రామరాజు తెలిపారు. భగవంతునికి సమర్పించే ప్రతి వస్తువులోనూ దైవత్వాన్ని దర్శించాలనే సందేశాన్ని ఈ కళారూపం చాటుతోంది. భక్తిని కేవలం పూజా విధానానికే పరిమితం చేయకుండా, గత 30 ఏళ్ల నుండి కళ ద్వారా కూడా దైవభావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో రామకోటి రామరాజు చేస్తున్న వినూత్న ప్రయత్నం. నైపుణ్యంతో చిత్రించడం పట్ల భక్తులు, స్థానికులు రామకోటి రామరాజును అభినందించారు.

## మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

మెదక్ (ప్రజాజ్యోతి):
మెదక్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో



కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా వీధి వీధినా వెలసిన విఘ్నేశ్వరుడి మండపాలు భక్తుల కోలాహలంతో ప్రాంగణాలుగా మారాయి. కుంకుమ పూజలు & దీపారాధనలు పూల పూజలు అర్చనలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ నిత్యం ప్రత్యేక కుంకుమ అర్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు మరియు దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు కొడుతూ, నిత్య నైవేద్యాలు సమర్పిస్తూ తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. లక్కీ డ్రాలు & తులం వెండి అనేక మండపాల నిర్వాహకులు భక్తులను ప్రోత్సహించేందుకు లక్కీ డ్రాలు నిర్వహిస్తూ విజేతలకు తులం వెండి నాణాలు, లక్కీ లడ్డూలను బహుమతులుగా అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నారు నవరాత్రుల తర్వాత నిమజ్జనం రోజు ఈ లక్కీ డ్రా లు నిర్వహించడం జరుగుతుంది. ప్రతీ



మండపం వద్ద భక్తుల కోసం రోజూ విరివిగా అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మరియు మండపాల కమిటీల మధ్య ఉత్తమ సమన్వయం కొనసాగుతోంది. సిసి కెమెరాల ఏర్పాటు, రద్దీ నియంత్రణ, మరియు నిమజ్జన ఊరేగింపుల రూట్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచుతూ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టారు.
మొత్తంగా భక్తిశ్రద్ధలు, అన్నదానాలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో మెదక్ జిల్లా అంతటా గణేష్ నవరాత్రులు అత్యంత దిగ్విజయంగా, శోభాయమానంగా సాగుతున్నాయి.

## ధర్మారెడ్డి పల్లి రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

గజ్వేల్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):
గజ్వేల్ నుంచి చేగుంట వెళ్లే ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి,మండల అధ్యక్షులు ఎల్కంటి సురేష్,పంజాల అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రహదారి పూర్తిగా దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు తేలడంతో నిత్యం ప్రయాణించే వందలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.చేగుంట పరిసర ప్రాంతాల్లోని స్క్రాప్ దుకాణాలకు భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్ల రైల్వే బ్రిడ్జి కింద ఏర్పడిన గుంతలు రోజురోజుకూ పెద్దవవుతున్నాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలని కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకోవడం మానుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రోడ్డు మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, మండల



ఉపాధ్యక్షులు శివమల్లు, శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం నాయకుడు మహేష్ చారి, మండల నాయకులు రామస్వామి, మురారి, లక్ష్మణ్, శ్రీరామ్, నగేష్, శ్రీరామరాజు, సోషల్ మీడియా నాయకుడు మణికంఠ ముదిరాజ్, నాయకులు మల్లేశం, వెంకటేష్ రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమి స్వాహా

### వెలికట్ట 271 సర్వేనెంబర్ భూమిని పరిశీలించిన సీఎల్పీ బృందం

కొండపాక సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):-
ఇటీవల అసెంబ్లీలో చర్చకు వచ్చిన కొండపాక మండలం వెలికట్ట శివారులోని 271 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి విషయంలో సి ఎల్ పి బృందం అట్టి భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తప్పుడు పత్రాలతోహరీశ్‌రావు మామ పేరుపై



6.18 ఎకరాలు మార్చుకున్నారని ఎంపీ ఎమ్మెల్సీల బృంద సభ్యులు ఆరోపించారు.ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి లు మాట్లాడుతూ 271 సర్వేనెంబర్ అసైన్డ్ భూమిని రిటైర్డ్ సైనిక ఉద్యోగులైన సత్యనారాయణకు కేటాయించారని అప్పుడు ఈ సర్వే నంబర్ లో గల 327 ఎకరాల్లో హద్దులు లేకుండానే వారికి కేటాయించారన్నారు. కేటాయించిన భూమిని ఎవరికి కూడా విక్రయించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ 2009 లో ఆర్డీవో ద్వారా తీసుకున్న ఎన్ఓసి ఆధారంగా ప్రధాన రహదారికి అనుకుని ఉన్న భూమి హద్దులను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఎన్ఓసి రిఫరెన్స్ నెంబర్ ఏ కార్యాలయంలో కూడా లేదన్నారు. ఎన్ఓసి అనేది జిల్లా కలెక్టర్ స్థాయి ఇవ్వాల్సి ఉంటుందని దీన్ని బట్టి చూస్తే పలుకుబడి ఉపయోగించి తప్పుడు ఎన్ఓసి తో రిజిస్ట్రేషన్ చేపించుకున్నారన్నారు. వీటిని సమగ్రంగా పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డికి



సూచించారు. బృంద సభ్యులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అద్దంకి దయాకర్ అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, ఎంపీ కావ్య మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

**భారీగా పోలీసు బలగాలు:**
సీఎల్పీ బృందం క్షేత్రస్థాయి పర్యటన వస్తున్న సందర్భంగా కొండపల్లి మండలం వెలికట్ట శివారులో భారీగా పోలీసులు చేరుకున్నారు. గొడవలు జరిగే అవకాశం ఉంటుందని ముందు జాగ్రత్తగా పోలీసులు భారీగా చర్యలు చేపట్టారు.

## పాంచజన్య సంకల్ప సభకు గజ్వేల్ నుంచి భారీ తరలింపు

– బహుజన తెలంగాణ సాధనే లక్ష్యం
– తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి

గజ్వేల్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):
కొడంగల్‌లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభకు గజ్వేల్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రక్షణ సేన శ్రేణులు



భారీగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నాయని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ కంటే బహుజన తెలంగాణ సాధనే లక్ష్యంగా కొత్త రాజకీయ పార్టీని స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అండగా నిలుస్తామని అన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం ప్రధాన అంశాలుగా ఉన్నాయని తెలిపారు.ముఖ్యంగా సామాజిక న్యాయానికి తెలంగాణ రక్షణ సేన పెద్దపీట వేస్తోందని, ఇప్పటి వరకు ప్రకటించిన పదవుల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.మన రాజ్యం రావాలంటే మనమే పోరాడాలి' అనే సంకల్పంతో కార్యకర్తలు ముందుకు సాగాలని కొట్టాల యాదగిరి పిలుపునిచ్చారు.గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో కొడంగల్‌కు తరలివచ్చి పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, లింగని రాజు, కనకరాజు, స్వామి, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోయి భీమన్న.. అక్షర సైనికుడు

### అస్పృశ్యత, కుల వివక్షపై కలంతో పోరాడిన సామాజిక చైతన్యవాది

కొమురవెల్లి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):
అస్పృశ్యత అనే అంధకారాన్ని పారద్రోలి, కుల వివక్షకు వ్యతిరేకంగా అక్షరాలను ఆయుధాలుగా మలిచి సమానత్వం, ఆత్మగౌరవం, మానవత్వం కోసం తన జీవితాంతం పోరాడిన మహనీయుడు బోయి భీమన్న అని కొమురవెల్లి పాఠశాల ఉపాధ్యాయుడు జక్కుల శ్రీనివాస్ తో పాటు పలువురు కొనియాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల బాధలు, శ్రమజీవుల కష్టాలు, సామాజిక అసమానతలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ భీమన్న ప్రజల్లో చైతన్యం రగిలించారు. ఆయన



కలం దీన వర్గాలకు అస్త్రంగా, ఆయన కంఠధ్వని ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.ఊరికి దూరంగా, శ్రమకు దగ్గరగా జీవించిన పేదలు, బలహీన వర్గాల సమస్యలకు తన రచనల ద్వారా గొంతుకగా నిలిచారు. సమానత్వపు జెండాను ఎగురవేస్తూ, వర్ణ వ్యవస్థలోని వివక్షను ప్రశ్నిస్తూ సామాజిక మార్పు కోసం నిరంతరం కృషి చేశారు. గుడిసెల్లో నివసించే పేదల నుంచి అట్టడుగు వర్గాల వరకు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఆయన రచనలు సాగాయి. సమాన న్యాయమే లక్ష్యంగా.. మానవత్వమే మార్గంగా భీమన్న సాగించిన సాహితీ ప్రస్థానం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. అక్షరాల ద్వారా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిన బోయి భీమన్నకు లభించిన పద్మభూషణ్ పురస్కారం ఆయన సాహితీ, సామాజిక సేవలకు దక్కిన గౌరవంగా నిలిచిందని తెలిపారు. ఆయన రచనలు సమసమాజ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు

– మహిళలచే సామూహిక కుంకుమార్చన
– కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు

దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 18( ప్రజా జ్యోతి)
భక్తుల మొదటి ఆరాధ్య దైవమైన గణనాథునికి నిత్య పూజలు జరగడం చాలా సంతోషకరంగా ఉందని బాలాజీ నగర్ సిద్ధి వినాయక యూత్ సభ్యులు అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు స్వామివారికి ఉదయం 10 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని





నిర్వహించారు. సాయంకాలం స్వామివారికి నిత్య పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్ కాలనీవాసులు సిద్ధి వినాయక యూత్ సభ్యులు మాట్లాడుతూ.... గణనాథుని కృపతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆ స్వామివారిని వేడుకున్నామన్నారు. స్వామివారికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కుంకుమార్చనలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు బాలాజీ నగర్ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా స్వామివారిని నెలకొల్పడం జరుగుతుందని బాలాజీ నగర్ కాలనీవాసులు తెలిపారు.

## గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలి

– విద్యుత్ అధికారులకు సర్పంచ్ సొప్పరి పుష్ప తనీష్ వినతి

జగదేవ్ పూర్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):
గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ సొప్పరి పుష్ప తనీష్ ఆవేదన వ్యక్తం చేశారు.జగదేవ్ పూర్ మండలం



కొండాపూర్ గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించి, వీధి దీపాలతో పాటు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ మేరకు శుక్రవారం గజ్వేల్‌లో విద్యుత్ శాఖ డీఈ, ఏఈలను వారి కార్యాలయంలో కలిసి విన తిప త్రం అ ంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో తక్కువ వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 25 కేవీ డీటీఆర్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. విద్యుత్ సమస్య కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ స్పందించి, అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పట్నంలో ప్రజా సమస్యలు పట్టించుకోరా..?

- వర్షపు నీరు మురుగుగా మారుతున్న అధికారులకు పట్టదా...?
- మురుగు నీరుగా మారి దుర్గంధం వెదజల్లుతుంది... స్థానికులు
- పలుమార్లు ఫిర్యాదు.. అధికారుల నిర్లక్ష్యం..?
- సమస్య పరిష్కరిస్తారా! పై అధికారులకు ఫిర్యాదు చేయాలా.?



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** వర్షపు నీరు తొలగించాలని మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పెడచెవిన పెడుతున్నారని స్థానికులు మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం చౌరస్తా, సాగర్ రహదారిపై అపోలో ఫార్మసీ వద్ద... వర్షం పడితే రోడంత చిత్తడి చిత్తడి, నీరంతా ఒకచోట చేరి మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతూ.. వాహనదారులకు పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న సమస్య పరిష్కరించలేని పరిస్థితిలో వారు ఉన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షపు నీరు రోడ్డు మీద నిలవడంతో, పాదచారులు రోడ్డు మధ్యలో నుంచి వెళ్లాల్సి రావడంతో, వాహనదారులు ఇబ్బంది పడుతూ వాహనాలు నడపగా, దీంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పెడుతున్న పెడుతున్నారని, దుకాణ సముదాయ యజమానులు మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భూమి చేరిన నీటిని తొలగించే ప్రయత్నం చేయాలని పాదచారులు వాహనదారులు దుకాణ సముదాయ యజమానులు కోరుచున్నారు. సమస్య పరిష్కరించలేనిపక్షంలో జిల్లా కలెక్టర్కు, సిడిఎంఏకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# విఘ్నేశ్వర యూత్ గణనాథునికి ప్రత్యేక పూజలు

- పూజలు చేసిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాము
- మండపం నిర్మాణానికి రూ. 33 వేల విరాళం



**యాచారం, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** తాడిపర్తిలో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపం నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నీలం రాములు రూ. 33 వేలు విరాళంగా అందజేశారు. తన కుమారుడు షణ్ముఖ తేజ్ పుట్టినరోజు సందర్భంగా నీలం రాము దంపతులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నీలం రాములు మాట్లాడుతూ గ్రామంలో యువకులు భక్తి శ్రద్ధలతో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, యువత ఇలాంటి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ముందుండాలని అన్నారు. తన కుమారుడి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ చిన్న సహాయం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.

# వార్డుల అభివృద్ధికి పెద్దపీట

- ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి
- ఎమ్మెల్యే కాలే యాదయ్య
- రూ.52 లక్షలతో 11వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**చేవెళ్ల, సెప్టెంబరు 18(ప్రజా జ్యోతి) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలో వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా 11వ వార్డులో రూ.52 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. నగర అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన రూ.52 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి..!

**వినాయకుని వద్ద అంబేద్కర్ యూత్ సభ్యులు అన్నదానం**



**నందిగామ, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** నందిగామ మండలం రంగాపురం గ్రామంలో అంబేద్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని వేడుకున్నట్లు అంబేద్కర్ యూత్ సభ్యులు తెలిపారు.

విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విఘ్నానాలు తొలగించి విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్మూర్ సాయికుమార్, పవన్ కుమార్, నరసింహ, రాఘవేందర్, మహేందర్, విజయ్, నరసింహ, చంద్రయ్య, నాయకులు నవపేట రవీందర్ గౌడ్, బసవయ్య, రామచంద్రయ్య, దర్శన్ గౌడ్, అంజయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేతోనే ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి




- పరిగి మున్సిపల్ హెల్ప్ డెస్క్ తనిఖీ
- భౌతిక ధృవీకరణ, విస్తృత ప్రచారానికి అధికారులకు ఆదేశాలు
- ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష

**పరిగి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనల మేరకు ప్రత్యేక నిరంతర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అలాగే రెవెన్యూ డివిజనల్ అధికారి యం. వాసుచంద్ర పరిగి మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్ను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె. మల్లేష్, ఎంపీడీఓ ఎహరిప్రియ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిల్ బాబు తదితర అధికారులతో కలిసి సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) కేవలం వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సమాచార సేకరణకు పరిమితం కాకుండా ప్రతి ఇంటికి వెళ్లి భౌతికంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, కొత్తగా పేర్ల చేర్పు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాలో తమ వివరాలు సరిచూసుకొని అవసరమైన దరఖాస్తులు సమర్పించేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు సమాచారం చేరవేసేందుకు స్వచ్ఛ భారత్ మున్సిపల్ వాహనాల మైకుల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అధికారులు సూచించారు.

# సామాజిక సేవలో కంజర్ల విజయలక్ష్మి






- తాండూర్ నియోజకవర్గంలో మహిళా రిజర్వేషన్పై ఆసక్తి
- ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో సేవా కార్యక్రమాలు
- గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు

**బషీరాబాద్, సెప్టెంబర్ 18, ప్రజా జ్యోతి :** తాండూర్ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కంజర్ల విజయలక్ష్మి ప్రజల్లోకి వెళుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ గ్రామాలలో మహిళలు కంజర్లకు హారతిలతో స్వాగతం పలుకుతున్నారు. గర్భిణీ స్త్రీల ఇంటి దగ్గరికి వెళ్లి కలవడం జరుగుతుంది. ముఖ్యంగా గర్భిణీలకు శ్రీమంతం, ఒక అక్క లాగా ఒక చెల్లి లాగా కొన్ని గ్రామాలలో గ్రామస్తులకు రాఖీలు కట్టడం, పొలాల్లో వెళ్లి మహిళలను కలుస్తూ నాట్లు వేయడం సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అవసరమైన వస్తువులు అందించడం, మహిళలతో మమేకమవడం వంటి కార్యక్రమాలపై ఆమె దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మహిళలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారని అనుచరులు పేర్కొంటున్నారు.

ఇటీవల స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశం నేపథ్యంలో తాండూర్ నియోజకవర్గంలో మహిళా నాయకుల రాజకీయ ఆసక్తిపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో విజయలక్ష్మి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. అయితే ఆమె రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆమె వర్గీయులు చెబుతున్నారు.

# అన్నదానం.. కోటి గోవుల దాన ఫలితంతో సమానం








- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్
- శ్రీ వినాయక సేవ సమితి, శ్రీ రామ్ నగర్ కాలనీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు
- హాజరైన కొత్తూరు సిఐ నాగార్జున రెడ్డి

**కొత్తూర్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** అన్నదానం..కోటి గోవుల దాన ఫలితంతో సమానమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ కాలనీలో శ్రీ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,సీఐ నాగార్జున రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని దానాలలో కెల్లా అన్న దానం మీన్న అని,అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్న ప్రసాదాన్ని వృధా చేయకుండా చూడవలసిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎస్సై గోపాలకృష్ణ, డిప్యూటీ ఎమ్మార్వో జంగయ్య, మాజీ కౌన్సిలర్ మాదారం నరసింహ గౌడ్, సోమ్లా నాయక్, మాజీ ఎంపిటిసి అనురాధకృష్ణ గౌడ్, రంగాపూర్ వార్డ్ సభ్యుడు నవపేట్ శ్రీనివాస్ గౌడ్,నాయకులు చిల్కమర్రి నరసింహ, కిషన్ నాయక్, కాలనీవాసులు రాజేందర్ ప్రసాద్, సురేందర్ ప్రసాద్, వీరమోని శ్రీనివాస్ ముదిరాజ్, పెప్సీ కృష్ణ గౌడ్, శ్రీశైలం, విక్రమ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది.. అన్నం పరబ్రహ్మ స్వరూపం

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి
- ఏకదంతా యూత్ అసోసియేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**కొత్తూరు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీలోని ఏకదంతా యూత్ అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై వినాయకుని మండపంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు.ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ మాదారం నరసింహ గౌడ్, సోమ్లా నాయక్, మాజీ ఎంపిటిసి అనురాధ కృష్ణ గౌడ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, కమ్మరి యాదగిరి చారి, శ్రీను చారి సిటీకేబుల్ వెంకటేష్, వీరమోని శ్రీనివాస్ ముదిరాజ్, ఎరుకలి విష్ణుమూర్తి, యువ నాయకుడు శివ చారి, తుప్పర రవీందర్, సత్యం, డీసీఎం బాలు, రంజిత్, పరంధాములు గౌడ్, అనిల్, డేవిడ్, సురేష్, కిరణ్, బాలు, యూత్ సభ్యులు సాయి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో ఇబ్రహీంపట్నం రోడ్లపై చర్చ..

- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే రంగారెడ్డి
- నెలల తరబడి నిలిచిన రోడ్డు పనులు ప్రజలు అవస్థలకు గురి.!
- రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలి: మల్రెడ్డి
- అసెంబ్లీలో నియోజకవర్గంలోని మండలాల రోడ్ల ప్రస్తావన
- వర్కింగ్ సీజన్ దృష్ట్యా పనులు నెమ్మదించాయన్న మంత్రి
- త్వరలోనే పూర్తిచేస్తామని కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వివరణ

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** నెలల తరబడిగా పనులు నిలిచిపోవటంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నట్లు, అసెంబ్లీలో ఎమ్మెల్యే తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలుమార్గాల్లో రోడ్ల నిర్మాణం ప్రారంభించినా.. పనులు పూర్తికాకపోవటంపై ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి శాసనసభలో ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్, ముకునూర్, దండుమైలారం, నాగన్పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధానమార్గం పనులు ప్రారంభించినా... రోడ్డును తవ్వి వదిలేసినట్లు చెప్పారు. ఈ కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వివరించారు. నాగార్జునసాగర్ ప్రధాన రహదారి నుంచి యాచారం మండలంలోని నందివనపర్తి, కుర్మిద్ద, మల్కీజ్గూడ, మేడిపల్లి తదితర గ్రామాల మీదుగా ఫ్యూచర్సిటీకి వెళ్లే రోడ్ల పనులు సైతం పెండింగ్లో ఉన్నట్లు శాసనసభా వేదికగా మల్రెడ్డి వివరించారు. నెలల తరబడిగా పనులు నిలిచిపోవటంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నట్లు చెప్పారు.



మల్రెడ్డి రంగారెడ్డి లేవనెత్తిన అంశాలకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి సమాధానమిచ్చారు. వర్కింగ్ సీజన్ దృష్ట్యా పనుల్లో కొంత జాప్యం జరిగినట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తిచేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# కొప్పుల హరీశ్వర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- మూడో వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ



**పరిగి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్, పరిగి నియోజకవర్గానికి ఐదుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన స్వర్గీయ కొప్పుల హరీశ్వర్ రెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా పరిగి మున్సిపల్ కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. క్షేత్రస్థాయి నాయకుడిగా ప్రజా సేవను ప్రారంభించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ స్థాయికి ఎదిగిన కొప్పుల హరీశ్వర్ రెడ్డి పరిగి ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. పరిగి గడ్డపై చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. ఆయన చూపిన అభివృద్ధి బాట, రాజకీయ విలువలు, ప్రజాసేవ పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శమని అన్నారు.

ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు చిరస్మరణీయమని, నాయకులు మరణించినా వారి ఆశయాలు, సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మీర్ తాహేర్ అలీ అన్నారు.

# పింఛన్ కోసం భారీగా దరఖాస్తులు

- బషీరాబాద్ మండలంలో 1,198 మంది ఎదురుచూపులు
- వితంతు పింఛన్కు అత్యధికంగా 739 దరఖాస్తులు




**బషీరాబాద్ సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని 39 గ్రామపంచాయతీల పరిధిలో వివిధ రకాల పింఛన్ల కోసం మొత్తం 1,198 మంది దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో వితంతువులు 739 మంది, ఒంటరి మహిళలు 171 మంది ఉన్నారు. అదేవిధంగా వికలాంగుల పింఛన్ కోసం 274 మంది, తాడి టాపర్ల పింఛన్ కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1,198 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అనంతరం అర్హత కలిగిన వారికి నిబంధనల ప్రకారం పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ఆశిస్తున్నారు.

# కన్నుల పండుగ ఏకదంతుని శోభాయాత్ర




**యాలాల్ సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి :** యాలాల మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో విగ్నేశ్వర స్వామి శోభా యాత్ర నా భూతో నా భవిష్యత్ అన్న విధంగా ముందుకు సాగింది. మాజీ సర్పంచ్ ఒంగనిబాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లడ్డు వేలం వేసిన అనంతరం, శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. గ్రామ యువతను ఉత్సాహపరిస్తూ, గ్రామ ప్రజలందరినీ కలుపుకొని ఆద్యంతం సాగిన శోభాయాత్ర పండుగ కనుల పండుగా సాగింది. అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ గూరు మల్లేష్ ఇతర యూత్ సభ్యులు విగ్నేశ్వర శోభాయాత్రలో పాల్గొన్నారు. యువత చేసిన డ్యాన్సులు శోభాయాత్రకే వన్నె తెచ్చాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఒంగనిబాయి శ్రీనివాస్, సర్పంచ్ కావలి సునీత, ఉప సర్పంచ్ కవిత గ్రామ ప్రజలందరూ విగ్నేశ్వర స్వామి కృపతో ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'యారీ కీ నయీ వైబ్' పేరుతో విజయ్ దేవరకొండ సరికొత్త ప్రచారం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :** హౌస్ ఆఫ్ మెక్డొవెల్స్ సోడా తన దీర్ఘకాల బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండతో కలిసి 'యారీ కీ నయీ వైబ్' పేరుతో తాజా ప్రచారాన్ని ఆవిష్కరించిందని డయాజియో ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్, కేటగరీ హెడ్ ఆనందితా దత్తా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాచి అండ్ సాచి ఇండియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ కార్తీక్ స్మెటాసెక్ తోకలసి ఆయన మాట్లాడుతూ స్నేహంతో బ్రాండ్కు ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ, కొత్త తరం స్నేహాన్ని అనుభవించే విధానంలో వస్తున్న మార్పులను ఈ ప్రచారం ప్రతిబింబిస్తుందని తెలిపారు. కేవలం కలిసి సమయం గడపడం కాకుండా, ప్రతి కలయికను మరింత గుర్తుండిపోయేలా చేసే కొత్త అనుభవాలను సృష్టించడమే ప్రచార లక్ష్యమని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి సైన్స్ ఫెస్టివల్‌కు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సైన్స్ టాలెంట్ మ్యూజియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సౌత్ సైన్స్ డ్రామా పోటీలలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక



అభినందన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. సైన్స్ మన జీవితంలో అంతర్భాగమని, శాస్త్రీయ అంశాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం పెంపొందుతాయని అన్నారు.విద్యార్థులు వైజ్ఞానిక శాస్త్రంపై పట్టు సాధించడంతో పాటు వివిధ సైన్స్ పోటీలు, పోటీ పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు. రోబోటిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు సైన్స్‌తో సన్నిహిత సంబంధం ఉందని, ప్రయోగాత్మక విద్య ద్వారా నూతన విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు.జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించిన నరేందర్ రెడ్డి, రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి: జేఏసీ

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):
ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, టీజీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని టీఎన్‌జీవోల సంఘ భవన్‌లో టి జి ఈ జె ఏ సి ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.పీఆర్‌సీని వెంటనే ప్రకటించి



అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని వారు కోరారు. ఈహెచ్‌ఎస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, ఉద్యోగుల జీపీఎఫ్ తదితర దాచుకున్న సొమ్మును సకాలంలో చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 18న జరగాల్సిన ప్రభుత్వ సమావేశం మరోసారి వాయిదా పడటంపై ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితి ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సహనాన్ని బలహీనతగా భావించవద్దని, సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాస్వామ్య ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంగేం లక్ష్మణ్‌రావు, డాక్టర్ అరవింద్‌రెడ్డి, గూడ ప్రభాకర్‌రెడ్డి, విజయకుమార్, ఇరుమల్ల శారద, మారుపాక రాజేష్‌భరద్వాజ్, కోట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కావాలి

## గ్రామ సర్పంచ్ మల్లేష్‌గౌడ్

ఎండపల్లి, సెప్టెంబరు 18, ప్రజాజ్యోతి:
పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మండలంలోని గుల్లకోట సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్‌గౌడ్ అన్నారు. గ్రామంలో స్వచ్ఛత హి సేవ. స్వభావ స్వచ్ఛత.. సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను



వేర్వేరుగా సేకరించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్వచ్ఛ భారత్,స్వచ్ఛ గుల్లకోట'గా గ్రామాన్ని తీర్చిదిద్దుతామన్నారు. పంచాయతీ సిబ్బందికి ఆరోగ్య బీమా చేయించామని, ముగింపు కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమురయ్య, హెచ్‌ఎం మునిందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జగన్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం

## కేటీఆర్‌ను కలిసి కోరిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆత్మహత్యలు చేసుకోవద్దు, అండగా ఉంటామని సూచన

ఎండపల్లి, సెప్టెంబరు 18, ప్రజా జ్యోతి :
ఎండపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సింహాచలం జగన్ కుటుంబానికి బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో జగన్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కేటీఆర్‌ను కలిశారు. జగన్ కుటుంబ పరిస్థితిని వివరించి, పార్టీ తరఫున ఆర్థిక సాయం చేయాలని కోరారు.దీనిపై స్పందించిన కేటీఆర్.



జగన్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ కార్యకర్తలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం జగన్ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు.కొప్పుల ఈశ్వర్‌తో పాటు ఏలేటి కృష్ణారెడ్డి, గాజుల మల్లేశం, మారం జలంధర్‌రెడ్డి, కల్వల గంగాధర్‌రావు, ముత్యం బలరాంరెడ్డి, రాంచందర్‌గౌడ్, మాధవరావు, సందీప్, కల్వల తేజ, దూస గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే సురక్షిత సమాజ: సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి )
చట్టాలపై అవగాహన లేనికారణంగా చాలా మంది నేరాల బాట పడుతున్నారని, విద్యార్థి దశ నుంచే న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే సురక్షిత సమాజం ఏర్పాటవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ (ఆర్ట్స్) 'న్యాయ విజ్ఞాన సదస్సు' ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకుంటూనే, పౌర బాధ్యతలను నెరవేర్చాలని వారు సూచించారు. న్యాయం కేవలం ధనవంతులకే కాదని పేదలకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందిస్తుందని వివరించారు. సదస్సులో పాల్గొన్న ప్యానల్ న్యాయవాదులు పలు అంశాలపై ప్రసంగించారు. మత్తు పదార్థాల సేవనం ఒక సామాజిక రుగ్మత అని న్యాయవాదులు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల వల్ల విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని యశ్వంత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సరదా కోసం మొదలయ్యే అలవాటు, చివరకు నేరాలకు దారితీస్తుందని తెలిపారు. ఎన్.డి.పి.ఎస్ చట్టంలోని సెక్షన్ల గురించి వివరిస్తూ, మత్తు పదార్థాల రవాణా చేసినా లేదా వినియోగించినా కష్టమని, కఠిన కారాగార శిక్షలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.





విద్యార్థులు అటువంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, తమ స్నేహితులను కూడా చైతన్యపరచాలని కోరారు. ప్రస్తుత స్మార్ట్ ఫోన్ యుగంలో ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ఆశలు చూపి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని, ఓటిపి లు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు వ్యక్తిగత ఫోటోలను ఇంటర్నెట్‌లో పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకరిని కించపరుస్తూ పోస్ట్‌లు పెట్టినా, అసభ్యకర సందేశాలు పంపినా ఐటి చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. సైబర్ వేధింపులకు గురైతే తక్షణమే '1930' నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరమని అన్నారు. ప్రణాళికాబద్ధమైన చదువు, క్రీడలు, మరియు పెద్దల సలహాలు తీసుకుని అద్భుతమైన విజయాలు సాధించవచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఉచిత న్యాయసేవల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఏ. సత్యనారాయణ, కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ యన్. పద్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మౌనిక, షీ టీమ్ కానిస్టేబుల్ ఆకుల స్వప్న లు పాల్గొన్నారు. సదస్సు తమకు ఎంతో జ్ఞానాన్ని అందించిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానంతరం న్యాయసేవల అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

# కేంద్రం నిధులతో కరీంనగర్ రూపురేఖలు మారాయి

## ప్రధాని మోదీ ఆశీస్సులు, బండి సంజయ్ చొరవతో భారీగా నిధులు: డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):
కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కరీంనగర్ నగర రూపురేఖలు మారాయి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో నగర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. కరీంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ సిటీ, అమృత్, యూఐడీఎఫ్, యూసీఎఫ్ పథకాలతో పాటు కీలకంగా వ్యవహరించారని సునీల్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్-హన్మకొండ జాతీయ రహదారి నిర్మాణ పనులు రెండున్నరేళ్లలోనే పూర్తయ్యాయని ఆయన తెలిపారు. జగిత్యాల-కరీంనగర్ రహదారికి కూడా అనుమతులు లభించాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కరీంనగర్ అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం కంటే కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సునీల్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను తీసుకురావాలంటే సమర్థమైన నాయకత్వం అవసరమని, ఆ





రైల్వే స్టేషన్ ఆధునీకరణ, ఆర్‌ఓబీలు, సీఆర్‌ఎఫ్ తదితర మార్గాల ద్వారా కేంద్రం నుంచి నిధులు సమకూరుతున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో మొత్తం 46 ప్రాజెక్టులు ఉండగా, సుమారు 40 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, మరో ఆరు ప్రాజెక్టులు తుది దశలో ఉన్నాయని సునీల్‌రావు తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కరీంనగర్ అభివృద్ధికి రూ.934 కోట్ల నిధులు విడుదలయ్యాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగరంలో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడ్డాయని అన్నారు. నగర ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద రూ.132 కోట్ల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ నిధులతో కొత్త నీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కరీంనగర్‌ను యూసీఎఫ్ ప్రాజెక్టులో చేర్చి రూ.840 కోట్ల నిధులు తీసుకురావడంలో బండి సంజయ్‌కుమార్ విషయంలో బండి సంజయ్‌కుమార్ కృషి చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీకి అవకాశం కల్పించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, రాబోయే రోజుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని సునీల్‌రావు హామీ ఇచ్చారు. తెలంగాణలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసే ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం మరింత అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సోమిడి వేణు, పొన్నం లక్ష్మి -మొండయ్య, నాంపల్లి రేణుక-శ్రీనివాస్, కర్రె పద్మ-అనిల్, కో-ఆప్షన్ సభ్యులు సర్దార్ బల్వీర్ సింగ్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ దీపక్, బీజేపీ నాయకులు కటకం లోకేష్‌కుమార్, టి.చంద్రమౌళి, పండుగ నాగరాజు, వాసు, సత్యనారాయణరెడ్డి, కుంభం అనిల్‌కుమార్, హమీద్, దాసరి రమేష్, ఐలేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి మహిళా రైతులకు ఆయిల్‌పామ్‌తో ఆర్థిక భరోసా

## ఉద్యాన శాఖ రాయితీకి అదనంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక సహాయం

పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి:
పెద్దపల్లి జిల్లాలోని ఒంటరి మహిళా రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించి, వారికి స్థిరమైన ఆదాయాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఉద్యాన శాఖ ద్వారా అందించే సాధారణ రాయితీకి అదనంగా రైతు వాటాగా అయ్యే ఖర్చును జిల్లా యంత్రాంగం భరించేలా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక సహాయం అందించనున్నారు.





ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు, అంతర పంటలు, డ్రిప్ పరికరాలపై నాలుగు సంవత్సరాల కాలానికి ఎకరానికి రూ.16,800 రాయితీ అందించనున్నారు. దీనికి అదనంగా రైతుపై పడే ఖర్చును జిల్లా యంత్రాంగం భరించనుంది. భర్తను కోల్పోయిన లేదా ఇతర కారణాలతో ఒంటరిగా జీవిస్తూ ఆర్థికంగా వెనుకబడిన మహిళా రైతులు ఈ ప్రత్యేక సహాయానికి అర్హులు. 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు భూమి కలిగిన మహిళా రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆయిల్‌పామ్ మొక్కలు పక్వానికి వచ్చే మొదటి నాలుగు సంవత్సరాల్లో కూరగాయలు తదితర అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుబడికి వచ్చిన అనంతరం నాలుగో సంవత్సరం నుంచి ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా రైతులు తమ గ్రామంలోని ఉద్యాన శాఖ విస్తరణ అధికారులు, ఉద్యాన అధికారులు, ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించవచ్చు. స్వయం సహాయక సంఘాల ద్వారా లేదా ఐడీఓసీలోని జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా యంత్రాంగం తెలిపింది. తమకు ఉన్న భూమిని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల సాగు ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నదే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. అర్హులైన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరాలి

## వెయ్యి ఎకరాల్లో సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 18(ప్రజాజ్యోతి ):
జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయిల్‌ఫామ్ సాగును విస్తరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేలా రైతులను



ప్రోత్సహించాలని ఆదేశించారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంట సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి వారిని ముందుకు తీసుకురావాలని సూచించారు.జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగు పురోగతిపై కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి తన ఛాంబర్‌లో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చింతల రోహిత్, జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ తో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం, రైతులను ప్రోత్సహిస్తున్న విధానం, లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఏఈవోలకు మండలాల వారీగా లక్ష్యాలు:

ఆయిల్‌ఫామ్ సాగు విస్తరణలో భాగంగా ప్రతి ఏఈవోకు 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించి, రైతులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఆయిల్‌ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ రెండు మండలాల్లో ఒక్కొక్క మండలంలో 50 ఎకరాల చొప్పున ఆయిల్‌ఫామ్ సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. చిగురుమామిడి మండలంలో సుమారు 25 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. నర్సరీ ఏర్పాటుతో రైతులకు అవసరమైన మొక్కల లభ్యతకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నందున, ఈ పంట వైపు రైతులను మళ్లించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు సాగు విధానం, ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# మాట ఇచ్చిన మేరకు పాఠశాలకు కుర్చీల అందజేత

ముస్తాబాద్, సెప్టెంబర్ 18( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండలం వెంకట్రావు పల్లి లో గణతంత్ర దినోత్సవం



సందర్భంగా వెంకట్రావుపల్లి ప్రాథమిక పాఠశాలకు 10 కుర్చీలు అందజేశారు. జనవరి 26న జరిగిన కార్యక్రమంలో గ్రామ మొదటి వార్డు సభ్యులు పెంజర్ల రవీందర్ రెడ్డి పాఠశాలకు 10 కుర్చీలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తాజాగా పాఠశాలకు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అవసరాలను గుర్తించి కుర్చీలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురభి దశరథరావు, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపసర్పంచ్ వినోద్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

వేములవాడ,సెప్టెంబర్,17:ప్రజాజ్యోతి:
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని, గౌరవనీయులైన తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆలయానికి విచ్చేయగానే ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి





వచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఆది శ్రీనివాస్ కి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి, పూలమొక్కను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆలయ ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థాన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి

### హెచ్ఐవి రహిత జిల్లాగా ఖమ్మం ను తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి: ఖమ్మం జిల్లాను హెచ్ఐవి,ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో




అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్&బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఆర్&బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,లింక్ వర్కర్లు తదితరులు హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు అవగాహన, జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన ఆరోగ్య అలవాట్లు ఎంతో కీలకమని అన్నారు.

ముఖ్యంగా యువతలో ఎయిడ్స్ పై శాస్త్రీయమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎయిడ్స్ తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారికి సామాజిక మద్దతు అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు.జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని, ముఖ్యంగా యువత,విద్యార్థులు, అధిక ప్రమాదానికి లోనయ్యే వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి నిర్ధారణ, చికిత్స,అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జానపద కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కథన విధానం 'పల్లె సుద్దులు' ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డా. రామారావు,డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వేణు మాధవ్, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి



(ఎయిడ్స్, లెప్రసి) డాక్టర్ ఎల్. ప్రవీణ, ఎస్ఆర్&బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకీరుల్లా, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చెంచు రత్నయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం అధికారులు,సిబ్బంది,కె.సి.పుల్లయ్య స్వచ్ఛంద సేవా సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవా సిబ్బంది, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవా సిబ్బంది, ఎ. శంకర్, అప్పా ప్రెసిడెంట్, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 15 బెటాలియన్‌లో ఘనంగా మహా అన్నదానం

సత్తుపల్లి సెప్టెంబర్18(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల 15 బెటాలియన్ లో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా,మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పటాలపు అదనపు కమాండెంట్ ఎ. అంజయ్య పాల్గొని మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు.



అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పటాలపు కార్యాలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్, హోంగార్డ్స్ సిబ్బందికి అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అదనపు కమాండెంట్ మాట్లాడుతూ, అన్ని దానాలలో అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు. శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోష కరమైన విషయమని పేర్కొన్నారు. ఈ మహా అన్నప్రసాద కార్యక్రమంలో సహాయ దళాధిపతి బి. వేణుగోపాల్ రెడ్డి , ఆర్ఐలు శ్రీ కె.వి. గోపాల్, శ్రీ పి. ఉదయ్ కుమార్, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, హోంగార్డ్స్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సింగరేణి కార్మికుల ఆరాధ్య దైవం ఎమ్మెల్యే రాగమయి..



సత్తుపల్లి సెప్టెంబర్18(ప్రజా జ్యోతి): సత్తుపల్లి సింగరేణి ఓసి..3 ఏరియా అవంతిక కంపెనీకి ఇచ్చి 5 సంవత్సరాలు అవుతున్న గాని ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదు, ఓసి 3ని సింగరేణికి అప్పగించాలని సత్తుపల్లి శాసన సభ్యురాలు అభ్యర్థన అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో, దీనివలన చాలామందికి ఉపాధి జరుగుతుందని, సత్తుపల్లి ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ సి 3 అవంతిక కంపెనీకి వేలంలో వెళ్లడం వలన ,పనులు మొదలు పెట్టడమే కాకుండా సింగరేణికి దానిని అప్పగిస్తే ప్రత్యక్షంగా 2వేల మందికి, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి దొరుకుతుందని,35 సంవత్సరాలు వరకు బొగ్గు పని కాలం ఉంటుందని, ఎంతోమందికి ఉపాధి చూపించిన సింగరేణి అవుతుందని,సింగరేణి దక్కాలని ఆయన గతంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, డైరెక్టర్ పా,గతంలో జనరల్ మేనేజర్,ప్రస్తుతం ఉన్న జనరల్ మేనేజర్ కు కచ్చితంగా సింగరేణికే ఓసి 3 ని అప్పగించాలని విన్నవించుకున్నారు. సింగరేణికి అప్పజెప్పడం వల్ల ఓసి స్త్రీలో 150 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉంటుంది కాబట్టి, ద్వారా బ్యారియల్ కోల్ నష్టపోకుండా సింగరేణి తీసుకుంటుందని, దీని ద్వారా సింగరేణికి లాభం 10 మిలియన్ టన్నుల బొగ్గు ఆదావుతుందని తెలిపారు. కార్మికుల కోసం శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సింగరేణి కేటాయించాలని అసెంబ్లీలో చెప్పడంతో, ఆమెకు సింగరేణి పట్ల, కార్మికుల పట్ల, ఉన్న అభిమానం కార్మికుల కోసం ప్రయాసపడే ఆమెకు సింగరేణి కార్మికులంతా ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. ఈ విధంగా అసెంబ్లీలో ప్రస్తావించటంతో సింగరేణి అందరి కార్మికుల తరపున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## మణుగూరు జీఎమ్ఆర్పీ పాలిటెక్నిక్ లో విద్యార్థుల నిరసన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు, సెప్టెంబర్ 18, ప్రజాజ్యోతి : మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ జీఎమ్ఆర్పీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 97 (శక్తి స్కీమ్) కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శుక్రవారం కళాశాల ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ జీవో వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు.ఈ జీవో 97 రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని విద్యార్థులు స్పష్టం చేశారు. అందులో భాగంగా తరగతులకు వెళ్లబోమని, బయోమెట్రిక్ హాజరును పూర్తిగా బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే పరీక్షలను కూడా బహిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## ఎంపీడబ్ల్యూల సేవలకు సత్కారం

చర్ల, సెప్టెంబర్ 18:(ప్రజా జ్యోతి): చర్ల మండలం కేశవపురం గ్రామపంచాయతీలో శుక్రవారం ఎంపీడబ్ల్యూలుగా సేవలందిస్తూ గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బందిని అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రతి ఒక్కరికీ గౌరవ సూచకంగా సైకిళ్లను బహుకరించి, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అభివృద్ధిలో సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కేశవపురం సర్పంచ్ శ్రీమతి కాపుల శారద, ఉపసర్పంచ్ కునారపు సతీష్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సింగరేణిలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడా సందడి

### క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్

సత్తుపల్లి సెప్టెంబర్18(ప్రజా జ్యోతి) సింగరేణిలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో శుక్రవారం




కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాల సంయుక్తంగా ఫుట్ బాల్ , లాంగ్ టెన్నిస్ ,స్విమ్మింగ్ నిర్వహించారు. పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సానుకూల ఆలోచన విధానం పెంపొందుతుందని తెలిపారు.క్రీడలు వ్యక్తిగత జీవితంలో ఉత్సాహాన్ని , క్రమశిక్షణను పెంచడంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని అన్నారు. గెలుపు , ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు సూచించారు. ఎలాంటి గాయాలు,ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ప్రాంతీయ, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం జి.హరీష్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, సముద్రాల సుధాకర్ ఐఎన్టీయూసీ నాయకులు ఎం.డి. రజాక్, తీగల క్రాంతి కుమార్ , స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ సందబోయిన శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ రాజశేఖర్, యూనియన్ ప్రతినిధులు, వివిధ క్రీడల కెప్టెన్లు, క్రీడాకారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## పి.వి.ఎన్ కాలనీలో ఆధ్యాత్మిక శోభ... గణనాథునికి ప్రత్యేక పూజలు

### పాల్గొన్న ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్

సత్తుపల్లి సెప్టెంబర్18(ప్రజా జ్యోతి) స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి ఉద్యోగుల పి.వి.ఎన్ సెంటినరీ కాలనీలో కొలువుదీరిన గణేష్ మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐఎన్టియుసి ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్. వారు మాట్లాడుతూ సత్తుపల్లి పి.వి.ఎన్ కాలనీలో కుల , మతాలకు అతీతంగా కాలనీ కుటుంబ సభ్యులందరూ కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కాలనీ కుటుంబ సభ్యులను , గణేష్ కమిటీ సభ్యులను అభినందించారు. వినాయక విగ్రహ దాత దీపిక



భాస్కర్ లాల్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. కాలనీలో ఆధ్యాత్మిక శోభ కనపరిచే విధంగా కాలనీ మహిళా సోదర సోదరీమణులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజా కార్యక్రమాలు , సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని అభినందించారు.గణేశుని ఆశీస్సులు కాలనీ కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లేష్, చంద్రశేఖర్,నాగ ప్రకాష్ , నరసింహారావు ,కంచ శ్రీనివాస్ , రఘుపతి ,బద్రు,భూక్య రమేష్ ,వీర రాజు,సందీప్, దాసరి శ్రీనివాస్ ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## రైతులు, కూలీలను ఆదుకోవాలి

### *అఖిల భారత రైతు–కూలీ సంఘం డిమాండ్
### *డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

చర్ల, సెప్టెంబర్ 18:(ప్రజా జ్యోతి): చర్ల మండలంలో సాధారణ వర్షపాతం కంటే సుమారు 50 శాతం తక్కువ వర్షపాతం నమోదై కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిల భారత రైతు–కూలీ సంఘం చర్ల మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం చర్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా సంఘం నాయకుడు సంతపురి సురేష్ మాట్లాడుతూ అనుకున్న ప్రకారం వర్షాలు కురవకపోవడంతో ప్రస్తుత సీజన్‌లో పంట నష్టం తీవ్రంగా జరిగే అవకాశం ఉందని ఇప్పటికే అప్పుల భారంతో ఉన్న రైతులు, వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని తెలిపారు. కరువు కారణంగా వలసలు పెరిగే ప్రమాదం ఉందని కరువుపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం నిర్వహించి నివేదిక రూపొందించాలని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సంఘం డిమాండ్ చేసింది. రైతు ఆత్మహత్యలు జరగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు చేపట్టాలని కోరింది. బోర్లకు రోజుకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, రేషన్ ద్వారా నిత్యావసర సరుకులను రాయితీపై అందించాలని విజ్ఞప్తి చేసింది. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలీతో 200 రోజుల పని కల్పించాలని, వ్యవసాయ కూలీలకు ఇస్తామని ప్రకటించిన రూ.12 వేల పథకాన్ని బకాయిలతో కలిపి రూ.36 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది. రైతుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరింది. సీతారామ ప్రాజెక్టు నీటితో మండలంలోని రేగులగండి, పగిడేరు, సాంబయ్యగూడెం చెరువులను నింపి శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.అనంతరం రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు–కూలీ సంఘం నాయకులు కుంజ జోగారావు, మట్ట నరసింహారావు, గొంది ముయన్నతో పాటు రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## కర్రెగుట్టలో ఆశీర్వాద దీపం

చర్ల , సెప్టెంబర్ 18:(ప్రజా జ్యోతి): ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కర్రెగుట్ట ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాల ఆధ్వర్యంలో "సేవా సంకల్ప ప్రచారం"లో భాగంగా ఆశీర్వాద



దీపాన్ని వెలిగించారు. సేవ, సమర్పణ, సద్భావన, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి, ప్రజల సంక్షేమ భావనను బలోపేతం చేయాలని సంకల్పించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సేవ, సహకార భావనను అందించడంతో పాటు ప్రజల్లో నమ్మకం, భద్రత, సానుకూల భవిష్యత్తుపై ఆశలను పెంపొందించడమే ప్రచారం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఆశీర్వాద దీపం సేవ, సమర్పణ, సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు .

## పోషణ మాసంలో గర్భిణులకు శ్రీమంతం

చర్ల, సెప్టెంబర్ 18:(ప్రజా జ్యోతి ): పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పెద్దమిడిసిలేరు గ్రామపంచాయతీ పరిధిలో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిశువు జననం నుంచి తొలి వెయ్యి రోజుల ప్రాముఖ్యత, తల్లి–బిడ్డ ఆరోగ్యం, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం కిష్టారంపాడు గ్రామానికి చెందిన బాలింత తల్లి బాబుకు అన్నప్రాశన వేడుక నిర్వహించారు. చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ స్వరూపరాణి, సర్పంచ్ సుహాసిని, వార్డు సభ్యులు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, ఈశ్వరి, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



# లక్ష కోట్లలో వెయ్యి కోట్లు ఇస్తే చాలు

**మొదటిపేజీ తరువాయి..**

ఆపి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉన్నది కేవలం 67 ఎకరాలు మాత్రమేనని అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకుని, ఇప్పుడు మళ్లీ కొత్త కుట్రలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ ఈ అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతులకు కరెంట్ కోతలు, యూరియా కొరత, నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీలో వైఫల్యం లాంటి సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్షాలపై బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని దుష్ప్రచారం చేసి, ఇప్పటివరకు ఒక్క పైసా అవినీతిని కూడా నిరూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. 22ఏ కింద కోటి 20 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం వెనక భారీ కుంభకోణం



దాగి ఉందని ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజల కోసం కేసీఆర్ చేసిన త్యాగాలు అందరికీ తెలిసిన బహిరంగ పుస్తకమని కేటీఆర్ గుర్తుచేశారు. అసత్యాలు, అభూతకల్పనలతో చట్టసభల గౌరవాన్ని సీఎం భంగపరుస్తున్నారని విమర్శించారు. అక్రమ దందాలు, బ్లాక్ మెయిల్ రాజకీయాలతో పదవిలోకి వచ్చిన రేవంత్‌కు పరిపాలన చేతకావడం లేదని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. రాబోయే రోజుల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగోతాలను బయటపెడతామని, దోచుకున్న ప్రతి పైసాను కక్కిస్తామని కేటీఆర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

మరోవైపు ఫార్ములా–ఈ రేస్ కేసులో కేటీఆర్ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరయ్యారు. నాంపల్లి కోర్టులో విచారణకు ఏ1 కేటీఆర్‌తో పాటు ఏ2 అరవింద్ కుమార్ (ఐఏఎస్), ఏ3 బి.ఎల్.ఎన్.రెడ్డి కూడా హాజరయ్యారు. విచారించిన న్యాయమూర్తి తదుపరి విచారణ అక్టోబర్ 30కి వాయిదా వేశారు. ఫార్ములా–ఈ రేస్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి సుమారు రూ.55 కోట్లను విదేశీ సంస్థలకు బదిలీ చేయడంపై ఏసీబీ అభియోగపత్రం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ–రేస్ నిర్వాహణలో అవసరమైన అనుమతులు, ఆర్థిక విధివిధానాలు పాటించలేదని ఏసీబీ పేర్కొంది. ఏసీబీ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకొని నిందితులకు కోర్టు సమన్లు జారీ చేసింది. ఫార్ములా–ఈ రేసు కేసులో ఏ–1గా కేటీఆర్, ఏ–2గా ఐఏఎస్ అర్వింద్ కుమార్, ఏ–3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్.రెడ్డి, ఏ–4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో గత విచారణకు కేటీఆర్ గైర్హాజరయ్యారు.

## ఎయిర్‌ఫోర్స్ అమ్ములపొదిలో అత్యాధునిక విమానాలు

భారత వైమానిక దళం అమ్ములపొదిలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన శక్తిమంతమైన విమానాలు (ఎయిర్‌క్రాఫ్ట్), హెలికాప్టర్లు చేరనున్నాయి. ఎల్‌సీఏ తేజస్ ఎఫ్ఓసీ ట్విన్ సీటర్ ట్రైనర్లు, హెచ్‌టీటీ– 40 బేసిక్ ట్రైనర్ విమానాలు అందనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన విమానాలు,



హెలికాప్టర్లను భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్), పవన్ హన్స్ లిమిటెడ్‌కు అప్పగించే ఒక ప్రధాన కార్యక్రమంతో సహా పలు అధికారిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు తాను కర్ణాటకలోని బెంగళూరు, కేరళలోని కొచ్చిలలో పర్యటించనున్నట్లు ప్రకటించారు. తన పర్యటన వివరాలను తెలియజేస్తూ రాజ్‌నాథ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. "రక్షణ సంబంధిత కార్యక్రమాల కోసం కర్ణాటకకు వెళ్లే ముందు కేరళలో పర్యటిస్తాను. శుక్రవారం సాయంత్రం బెంగళూరు వెళ్తాను. అక్కడ భారత వైమానిక దళానికి రెండు ఎల్‌సీఏ తేజస్ ఎఫ్ఓసీ ట్విన్ సీటర్ ట్రైనర్లు, హెచ్‌టీటీ– 40 బేసిక్ ట్రైనర్ విమానాలను, అలాగే పవన్ హన్స్ లిమిటెడ్‌కు నాలుగు ధ్రువ్ ఎన్‌జీ హెలికాప్టర్లను అప్పగించే కార్యక్రమానికి హాజరవుతాను. ఈ పర్యటన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత దేశ స్వావలంబన ప్రయాణంలో ఈ విమానాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌ల అప్పగింత ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోనుంది. ఎందుకంటే దేశీయ ఏరోస్పేస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో హెచ్ఏఎల్, దాని భాగస్వాములు పోషిస్తున్న పాత్రను ఈ కార్యక్రమం హైలైట్ చేస్తుంది. ఏరోస్పేస్, రక్షణ రంగాలలో స్వదేశీ డిజైన్, అభివృద్ధి, తయారీని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు, సాఫ్ట్‌వేర్ ఇంటిగ్రేషన్ సవాళ్ల కారణంగా భారత వైమానిక దళానికి స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ ఎంకే1ఏ డెలివరీలు ఆటంకాలను ఎదుర్కొంటున్నాయని ఏరోస్పేస్ దిగ్గజం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తెలిపింది. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, డెలివరీలపై దృష్టి సారించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం ఫైటర్ జెట్ డెలివరీల స్థితిని వివరించింది. ప్రస్తుతం టెస్టింగ్ దశలలో విస్తృతమైన సాఫ్ట్‌వేర్ మార్పులు జరుగుతున్నాయని వెల్లడించింది. ఈ మేరకు హాల్ సీఎండీ రవి కుమార్ వ్యాఖ్యానించారు. ఎల్‌సీఏ తేజస్ ఎఫ్ఓసీ ట్రైనర్ అనేది తేలికైన, అన్ని వాతావరణ పరిస్థితులలో పనిచేసే, బహుళ ప్రయోజనాలు గల 4.5 తరం విమానం. దీన్ని ప్రధానంగా ఐఏఎఫ్ శిక్షణా అవసరాల కోసం రూపొందించారు. ఈ విమానంలో రిలాక్స్డ్ స్టాటిక్ స్టెబిలిటీ, క్వాడ్రుప్లెక్స్ ఫ్లై–బై–వైర్ ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్, కేర్‌ఫ్రీ మ్యానూవరింగ్, అధునాతన గ్లాస్ కాక్‌పిట్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఏవియానిక్స్, అధునాతన కాంపోజిట్ ఎయిర్‌ఫ్రేమ్ మెటీరియల్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ధ్రువ్ ఎన్‌జీ అనేది హెచ్ఏఎల్ రూపొందించి, తయారు చేసిన 5.5 టన్నుల బరువు గల తేలికపాటి హెలికాప్టర్. దీనిని భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ పౌర హెలికాప్టర్‌గా అభివర్ణిస్తారు. ఈ హెలికాప్టర్ గరిష్ఠంగా 5,500 కిలోల టేకాఫ్ బరువును, గంటకు సుమారు 285 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని, 20 నిమిషాల రిజర్వ్‌తో సుమారు 630 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. మరోవైపు, హెచ్‌టీటీ– 40 అనేది భారత రక్షణ దళాల ప్రాథమిక ట్రైనింగ్ అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన స్వదేశీ ప్రాథమిక శిక్షణా విమానం. దీన్ని ప్రాథమిక శిక్షణ, ఏరోబాటిక్స్, ఇన్‌స్ట్రుమెంట్ ఫ్లయింగ్, నావిగేషన్, నైట్ ఫ్లయింగ్, క్లోజ్ ఫార్మేషన్ ఫ్లయింగ్‌లకు ఉపయోగపడేలా రూపొందించారు.

# ప్రకృతి కరుణించింది

**చిరుచిరు జల్లులతో రైతన్నలో చిగురించిన ఆశలు..**

**రాష్ట్ర వ్యాప్తంగా పంటలు ఎండిపోతున్న వేళ వర్షాలతో అందిన జీవన దార..**

**అల్పపీడనంతో మూడు నాలుగు రోజుల కురిసిన వర్షాలు.**

అదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 18 ( ప్రజా జ్యోతి ): గత కొద్దిరోజులుగా భానుడి భగభగలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన అన్నదాతలకు, పట్టణ ప్రజలకు ప్రకృతి తీపి కబురు అందించింది. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న తేలికపాటి నుంచి మోస్తరు చిరుచిరు వర్షాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాతావరణాన్ని మురిపించాయి. ఎండిపోతున్న పంటలకు ఈ జల్లులు జీవనమృతంలా మారగా, పట్టణవాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది.

**కాత దశలో కరుణించిన వాన:**

ప్రస్తుతం చేన్లలో సోయాబీన్, పత్తి పంటలు అత్యంత కీలకమైన కాత, పూత దశలో ఉన్నాయి. సుమారు 20 రోజులుగా సరైన తేమ లేక, ఎండ తీవ్రతకు పంటలు వాడిపోతూ ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. పెట్టుబడులు మట్టిపాలవుతాయేమోనని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో, ఈ చిరుజల్లులు కరుణించాయి. పత్తి కాయ తొడిగే దశలో, సోయా



గింజ కట్టే సమయంలో పడిన ఈ వర్షపు చుక్కలు పంటలకు కొండంత బలాన్నిచ్చాయి. వాడిపోయిన మొక్కలు మళ్లీ పచ్చదనంతో అలరారుతున్నాయి.

**పట్టణాల్లో హాయి.. ఆహ్లాదకరమైన చల్లదనం**

మరోవైపు ఈ వర్షాల ప్రభావం పట్టణాలపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడిన పట్టణ ప్రజలకు ఈ చిరుజల్లులు హాయినిచ్చాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. సాయంత్రం వేళల్లో చల్లని గాలులు వీస్తుండటంతో వీధులన్నీ కోలాహలంగా మారాయి. ఏసీలు, కూలర్ల అవసరం లేకుండానే వాతావరణం సుఖకరంగా మారింది.

**రైతన్న ముఖాల్లో ఆనందహేల:**

సమయానికి కురిసిన ఈ చిరుజల్లులు పంట దిగుబడిపై సానుకూల ప్రభావం చూపుతాయని వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు. ఎండిపోతున్న దశలో పడిన వర్షం వల్ల కాయ పరిమాణం పెరిగి, రైతులకు మంచి దిగుబడి వచ్చే అవకాశం ఏర్పడింది.

రైతు దేశానికి వెన్నెముక అంటారు. అలుపెరగని శ్రమతో పొలాన్ని దున్ని, విత్తనాలు నాటి, పంటను పండించి మనందరికీ ఆహారాన్ని అందించే గొప్ప వ్యక్తి రైతు. ఎండనక, వాననక రాత్రింబవళ్ళు శ్రమిస్తూ, తన జీవితాన్ని పొలంలోనే గడుపుతాడు. సమాజానికి అతను చేసే త్యాగం, చూపించే శ్రమ వెలకట్టలేనిది. మొత్తానికి ఈ మూడు రోజుల వానలు



గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ధైర్యాన్ని, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సుఖ చల్లదనాన్ని అందించాయి.. ముఖ్యంగా పంటల్లో ప్రాణం పోసాయి..

అన్నంవార్ దత్తు ( ప్రజా జ్యోతి )
అదిలాబాద్ టౌన్

# ఆదిలాబాద్‌లో జిల్లా కేంద్రం లో కాంగ్రెస్ సర్పంచులు, ఉ ప సర్పంచులకు శిక్షణ

**గ్రామీణ పాలనపై అవగాహ న కల్పించడమే శిక్షణలక్ష్యం.. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి ) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా క్టర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యం లో, ఏఐసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘట న్ (ఆర్ జి పి ఆర్ ఎస్) ఆ ధ్వర్యంలో ఆదిలాబాద్ ని యోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులకు



శిక్షణ కా ర్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కా ర్యదర్శి సచిన్ సావంత్ ము ఖ్య అతిథిగా హాజరయ్యా రు. గ్రామ పంచాయతీల అ భివృద్ధి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చే రవే యడం, సర్పంచులు, ఉప సర్పంచుల బాధ్యతలు, హ క్కులు, పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరుపై ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. గ్రామాల అభి వృద్ధిలో ప్రజల భాగస్వా మ్యాన్ని పెంచుతూ, ప్రజల కు మెరుగైన పాలన అందిం చే విధంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించా రు.

**గ్రామస్థాయిలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే సం ఘటన్ సృజన్ అభియాన్ లక్ష్యం:**

ఈ సందర్భంగా నిర్వహిం చిన విలేకరుల సమావేశం లో ఏఐసీసీ కార్యదర్శి సచి న్ సావంత్ మాట్లాడుతూ, సంఘటన్ సృజన్ అభియా న్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తం గా సర్పంచులు, ఉప సర్పం చులు, స్థానిక ప్రజా ప్రతి ని ధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మ రింత బలోపేతం చేయడం తో పాటు, ప్రజలకు మెరు గైన పాలన అందించేలా ప్ర జాప్రతినిధులకు అవసర మైన అవగాహన కల్పించ డమే ఈ కార్యక్రమాల ప్రధా న ఉద్దేశమని పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అ మలు చేస్తున్న సంక్షేమ, అ భివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సర్పం చులు, ఉప సర్పంచులు కృ షి చేయాలని సూచించారు. గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు, ప్రజల కు ఎల్లప్పుడూ అందుబా టులో ఉండాలని అన్నారు.

తదనంతరం టీపీసీసీ అధి కార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్ర భుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నా రు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు వాస్త వా లతో గమనించా లని పేర్కొ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత వి ద్యుత్, రైతులకు రూ.2 లక్ష ల వరకు రుణమాఫీ వంటి హామీలను అమలు చేసిన ట్లు తెలిపారు. పేదల సంక్షే మాన్ని దృష్టిలో ఉంచుకుని సన్న బియ్యం పంపిణీ, ఇం దిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను కూడా ప్రభు త్వం చేపట్టిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో రా ష్ట్రం పై ఏర్పడిన అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే, ప్ర జలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రె స్ ప్రభుత్వం కృషి చేస్తోంద ని ఏబీ శ్రీనివాస్ తెలిపారు.

22ఎ భూములకు సంబం ధించిన అంశాలపై ప్రభు త్వం సమగ్రంగా పరిశీలన జరుపుతోందని, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో గతంలో చోటుచేసుకున్న భూ వ్యవ హారాలపై అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వివరాలు వెల్లడించార ని తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆశ యాలకు అనుగుణంగా తె లంగాణలో సమగ్ర కుల గ ణన చేపట్టడం ద్వారా సా మాజిక న్యాయం దిశగా ప్ర భుత్వం కీలకమైన అడుగు వేసిందని ఏబీ శ్రీనివాస్ పే ర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం, అవకాశాలు క ల్పించాలనే లక్ష్యంతో కాంగ్రె స్ ప్రభుత్వం ముందుకు సా గుతోందన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పం చాయతీ రాజ్ వ్యవస్థ అ త్యంత కీలకమైనదని, స్థా నిక ప్రజాప్రతిని ధులు బా ధ్యతాయుతంగా వ్యవహ రిస్తే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతమవు తుందని నాయకులు పేర్కొ న్నారు. ఈ శిక్షణ ద్వారా సర్పంచులు, ఉప సర్పంచు లు తమ బాధ్యతలు, హ క్కులు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి ప్ర ణాళికలపై మరింత అవగా హన పొందుతారని తెలిపా రు.ఈ కార్యక్రమంలో వారి తో పాటు మాజీ జిసిసి చైర్మ న్ కోట్నా తిరుపతి, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గం ఇంచా ర్జి ఆడే గజేందర్, బోథ్ ని యోజకవర్గం సర్ కో ఆర్డి నేటర్ రమేష్, టీపీసీసీ మా జీ ప్రధాన కార్యదర్శి గంగ్రత్ సుజాత, డీసీసీ మాజీ అధ్య క్షుడు సాజిద్ ఖాన్ , మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవ్ రెడ్డి , మార్కెట్ చైర్మన్ బోరం చు శ్రీకాంత్ రెడ్డి, అడ్డి భోజ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి



అనూష సతీష్, ఆ త్మ కమిటీ చైర్మన్ గిమ్మ సం తోష్, ఇచ్చోడ మార్కెట్ క మిటీ చైర్మన్ సత్యవతి కోటే ష్, సీనియర్ కాంగ్రెస్ నా యకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, టీపీసీసీ ఎస్సీ డిపా ర్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ దుర్గం శేఖర్, ఎస్సీ డిపార్ట్మెం ట్ జిల్లా చైర్మన్ పరమేశ్వర్ , మాజీ టిటిడి బోర్డు సభ్యు లు బెజ్జంకి అనిల్, డిసిసి ప్రధాన కార్యదర్శి గౌలీ సంజ య్, జిల్లా మైనారిటీ విభా గం అధ్యక్షులు షాహిద్ అ లీ, ఓబీసీ సెల్ అధ్యక్షులు అంబకంటి అశోక్, జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగ అధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, స్థానిక సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్,జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేంద ర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్య క్షులు జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు కాంగ్రెస్ పార్టీ స ర్పంచులు, మండల అధ్య క్షులు, నాయకులు కార్యకర్త లు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పా ర్టీ నాయకులు, సర్పంచు లు, ఉప సర్పంచులు, ఆర్ జి పి ఆర్ ఎస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరు లు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఎన్నికల నగారా!

**మొదటిపేజీ తరువాయి..**

ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా షెడ్యూల్ విడుదల కావడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది. కార్మిక శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 21వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసేందుకు యూనియన్ల సమ్మతి



తీసుకోనున్నారు. సెప్టెంబర్ 22వ తేదీన యూనియన్లకు ఓటర్ల జాబితాను అందజేసి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. సెప్టెంబర్ 24వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేయడానికి అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 25వ తేదీన తుది ఓటర్ల జాబితాను యూనియన్లకు అందజేస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన పోటీ చేసే యూనియన్లకు ఎన్నికల గుర్తులు కేటాయించడంతో పాటు తుది ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు. సెప్టెంబర్ 29వ తేదీన యూనియన్లకు డమ్మీ బ్యాలెట్ పేపర్లు అందించనున్నారు. అక్టోబర్ 9వ తేదీన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను అక్టోబర్ 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నారు. అనంతరం అక్టోబర్ 17వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో మెజారిటీ సాధించిన కార్మిక సంఘానికి ఆర్టీసీలో గుర్తింపు లభించనుంది. మొత్తం 11 కార్మిక సంఘాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ పంపినట్లు సమాచారం. ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో మెజారిటీ సాధించి గుర్తింపు పొందిన సంఘానికే సంస్థ తరఫున కార్మికుల సమస్యలపై అధికారికంగా చర్చించే హక్కు ఉంటుంది. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనలు వంటి అంశాలపై ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడంలో ఈ గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది.అంతేకాకుండా కార్మికుల తరఫున ఒప్పందాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చల్లోనూ గుర్తింపు సంఘం ప్రాతినిధ్యం వహిస్తుంది. రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు సంఘాల కోసం వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించనున్నారు. రీజియన్‌లో ఆఫీసర్ స్థాయిలో ఉన్న ఉద్యోగులు మినహా మిగిలిన అర్హులైన ఆర్టీసీ ఉ ద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో వివిధ కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఏ సంఘానికి కార్మికుల మద్దతు లభిస్తుందనేది అక్టోబర్ 17వ తేదీన వెలువడే ఫలితాలతో తేలనుంది.

# మరో 9.56 లక్షల ఇళ్లు ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి..**

పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, 2 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్రమంత్రికి వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీరు, విద్యుత్ కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు తెలంగాణలో సన్నబియ్యాన్ని విజయవంతంగా పంపిణీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్‌ను రైతులకు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం జరుగుతండటంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967